
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రాజన్న సిరిసిల్ల
జిల్లా వార్తలు
3★★★
మంగళవారం 19 నవంబరు 2024





ధర్మగుండం వద్ద భక్తులు

రాజన్న క్షేత్రం..
భక్తజన సంద్రం
- తరలివచ్చిన భక్తులు
- ఆలయంలో కార్తీక దీపోత్సవం

5



ఏర్పాట్లు చేస్తున్న సిబ్బంది

సీఎం పర్యటనకు ఏర్పాట్లు
- రేపు 'రాజన్న' దర్శనం.. బహిరంగ సభ
- యారన్ డిపో, ఎస్పీ కార్యాలయం ప్రారంభోత్సవం

4

పెరిగిన చలి

- వృద్ధులకు, పిల్లలకు ఇబ్బంది
- వాతావరణంలో అనూహ్య మార్పులు
- పొంచి ఉన్న సీజనల్ వ్యాధులు
- జిల్లాలో 12.0 డిగ్రీలకు పడిపోయిన కనిష్ట ఉష్ణోగ్రత
- ఎల్లో అలర్ట్‌లో జిల్లా



జిల్లా కేంద్రంలో పొగమంచు

(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

వాతావరణంలో మార్పులు మొదలయ్యాయి. రెండు, మూడు రోజులుగా చలి తీవ్రత పెరుగుతోంది. రాజన్న సిరిసిల్ల జిల్లాలో కనిష్ఠ ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. జిల్లాలో సోమవారం తెల్లవారుజామున 12.0 కనిష్ఠ డిగ్రీల్లో ఉష్ణోగ్రత నమోదైంది. గరిష్ఠ ఉష్ణోగ్రత 33.9 డిగ్రీలుగా నమోదైంది. వాతావరణ శాఖ జిల్లాను ఎల్లో అలెర్ట్‌గా ప్రకటించింది. జిల్లాలోని వీర్నపల్లిలో 12.0, రుద్రంగిలో 12.1, తంగళ్లపల్లిలో 12.2, గంభీరావుపేటలో 12.4, కోనరావుపేట, ముస్తాబాద్‌లో 13.1 కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రోజు రోజుకు ఉష్ణోగ్రతల్లో మార్పులు వస్తుండడంతో పిల్లలు, వృద్ధులు ఆరోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారు. అస్తమా, దగ్గు, జ్వరం వంటివి మొదలయ్యాయి. వాకింగ్, జాగింగ్ చేయడానికి అనువైన కాలమే అయినా జాగ్రత్తలు పాటించకుంటే ప్రమాదమని వైద్యులు హెచ్చరిస్తున్నారు. చలి మంటల వద్ద జాగ్రత్తగా ఉండాలని సూచిస్తున్నారు. గజ గజ వణికించే చలికి తట్టుకోవడానికి నూలు వస్త్రాలు, స్వెటర్లు, మఫ్లర్‌లు వాడాలని పేర్కొంటున్నారు. తెల్లవారు జామున చలి తీవ్రత ఎక్కువగా ఉంటుంది. చలికి వ్యాధులు ప్రబలే అవకాశం ఎక్కువగా ఉంటుందని జాగ్రత్తలు పాటించాలని వైద్యులు హెచ్చరిస్తున్నారు. అనారోగ్య సమస్యలు ఎదుర్కుంటున్నావారు చలి వేళలో బయటకు రావద్దని సూచిస్తున్నారు.

వైద్యుల సూచనలు

చలికాలం వ్యాధులు ఎక్కువగా ప్రబలే అవకాశం ఉందని, ముఖ్యంగా శ్వాసకు సంబంధించిన సమస్యలు ఎక్కువగా ఉంటాయని వైద్యులు చెబుతున్నారు. చలికాలంలో పాటించాల్సిన జాగ్రత్తలను వెల్లడించారు.

చలికాలంలో అస్తమా ఉన్న వారు నిత్యం వాడే మందులను ఎప్పుడూ సిద్ధంగా ఉంచుకోవాలి. సిగరేట్ అలవాటు ఉన్నవారు మానివేయాలి.దుమ్ము, ధూళీ పనులకు దూరంగా ఉండాలి. చల్లని గాలికి ఎక్కువగా తిరగవద్దు. శ్వాసనాళాలు మూసుకుపోకుండా మందులు వాడాలి.ఇన్‌హేలర్, నెబ్లైజర్ వంటి వాటిని కూడా వాడాలి. ముక్కుభాగంలో ఇన్‌ఫెక్షన్ ఎక్కువై తెమడ పేరుకుపోయి ఇబ్బంది పడే వారు సిరప్‌లు వాడాలి. చలికాలంలో ద్విచక్రవాహనంపై ప్రయాణించే వారు హెల్మెట్ తప్పనిసరిగా ఉపయోగించాలి. స్వెట్టర్‌లను ధరించాలి. చలికాలంలో గుండెజబ్బు ఉన్నవారు, గుండె ఆపరేషన్ చేయించుకున్నవారు వాకింగ్ చేయవద్దు. చలిలో ఎక్కువగా తిరగడంతో రక్తనాళాలు సంకోచించి గుండెకు సంబంధించిన సమస్యలు వస్తాయి. బీపీ, షుగర్ ఉన్న వారు కూడా ఈ జాగ్రత్తలు పాటించాలి. ఉన్నఫలంగా ఛాతీలో నొప్పి, నడవలేకపోవడం, చెమటలు పట్టడం వంటి సమస్యలు వచ్చినప్పుడు డాక్టర్లను సంప్రదించాలి.

పిల్లలపై దృష్టిసారించాలి

చలికాలంలో చిన్నారులకు జబ్బులు రాకుండా జాగ్రత్తలు పడాలి. చలి నుంచి రక్షణ కోసం స్వెట్టర్‌లను తొడిగించాలి.

మిగతా 8వ పేజీలో

న్యూస్ బాక్స్

తెలంగాణ చేనేత ఐక్యవేదిక జిల్లా కార్యవర్గం

సిరిసిల్ల రూరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ చేనేత ఐక్యవేదిక రాజన్న సిరిసిల్ల జిల్లా నూతన కార్యవర్గాన్ని నియమించినట్లు రాష్ట్ర అధ్యక్షుడు రాపోలు వీరమోహన్ సోమవారం ప్రకటించారు. జిల్లా అధ్యక్షుడిగా శ్రీగాధ మైసయ్య, ఉపాధ్యక్షుడిగా దూస సత్తయ్య, ప్రధాన కార్యదర్శిగా ఊరగోండ రాజు, సహాయ కార్యదర్శిగా అంకారపు రాజు, కోశాధికారిగా యెల్లె దేవదాస్, సభ్యులుగా తవుటు తిరుపతి, గడ్డం నాగభూషణం, సోషల్ మీడియా కన్వీనర్‌గా సిరిమల్లె మల్లేశంను నియమించినట్లు పేర్కొన్నారు.

సీహెచ్‌సీ పిల్లల వైద్య నిపుణుడిగా ఓంకార్

ఎల్లారెడ్డిపేట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రం పిల్లల వైద్య నిపుణుడిగా వైద్యుడు ఓంకార్ నియామకమయ్యారు. సోమవారం ఆరోగ్య కేంద్రంలో బాధ్యతలు స్వీకరించారు. పిల్లల ఆరోగ్య సమస్యల పరిష్కారానికి అందుబాటులో ఉండి మెరుగైన వైద్య సేవలు అందిస్తానని పేర్కొన్నారు.

21న చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్

ఇల్లంతకుంట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఎమ్మార్సీ భవనంలో ఈ నెల 21న మండల స్థాయి చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు మహేష్‌చంద్ర, అనీల్ కుమార్ తెలిపారు. పాఠశాల స్థాయిలో ఉత్తమంగా నిలిచిన ముగ్గురు విద్యార్థులను పంపాలని సూచించారు.

రాజన్న ఆలయ అభివృద్ధికి శ్రీకారం



- రూ.126 కోట్ల నిధులు మంజూరు చేస్తూ జీవో జారీ
- 16 కిలోల బంగారంతో గోపురానికి తాపడం
- రేపు సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపనలు

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

దక్షిణ కాశీగా విరాజిల్లుతున్న వేములవాడ రాజ రాజేశ్వరస్వామి దేవస్థానానికి భక్తుల రద్దీ భారీగా పెరుగుతోంది. దీంతో భక్తుల రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయి. దశాబ్దాల కాలంగా ఆలయ విస్తరణ పనులు పట్టణ ఇతర అభివృద్ధి పనులు కూడా ముందుకు సాగని పరిస్థితులు నెలకొన్నాయి. గత ప్రభుత్వం ఏటా రూ.100 కోట్లు కేటాయిస్తూ రూ.400 కోట్లకు పైగా ఖర్చు చేసి అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చినా ముందుకు సాగలేదు.

కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం వైపు భక్తులు ఎదురుచూసినట్లుగానే అభివృద్ధి వైపు అడుగులు పడుతున్నాయి. సోమవారం వేములవాడ అభివృద్ధికి సంబంధించి రూ.127.65 కోట్లు మంజూరు చేస్తూ ప్రభుత్వం జీవోలు జారీ చేసింది. వేములవాడ రాజారాజేశ్వర ఆలయ కాంప్లెక్స్ విస్తరణ, భక్తులకు అవసరమైన అధునాతన సదుపాయాలకు రూ.76 కోట్లు కేటాయించారు. వేములవాడ దేవస్థానానికి వెళ్లే మూలవాగుపై బ్రిడ్జి, రోడ్ల వెడల్పునకు సంబంధించి రూ.47.85 కోట్లు మంజూరు చేశారు.

మూలవాగులో బతుకమ్మ తెప్ప నుంచి జగిత్యాల కమాన్ వరకు నూతన మురికి కాలువ నిర్మాణానికి రూ.3.8 కోట్ల పనులకు ఆమోదం లభించింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బుధవారం అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయనున్నారు.వేములవాడకు ముఖ్యమంత్రి రానున్న నేపథంలో పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేశారు. ఉదయం రాజరాజేశ్వర స్వామిని దర్శించుకొని గుడి చెరువు మైదానంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడనున్నారు. ముఖ్యమంత్రి వేములవాడలో గతంలో ఇచ్చిన హామీ మేరకు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టడంతో హర్షం వ్యక్తం అవుతోంది. రాజన్న ఆలయ అభివృద్ధికి మహర్దశ పట్టినట్లుగా భావిస్తు న్నారు. వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌ను ప్రభుత్వ విప్‌గా నియమించడంతో వేములవాడ రాజరాజేశ్వరస్వామి దేవస్థానం అభివృద్ధికి చేస్తున్న కృషిని అభినందిస్తున్నారు. వేముల వాడ ఆలయ విస్తరణ అభివృద్ధి పనులతోపాటు నూతనంగా రెండో ధర్మగుండం నిర్మాణం, వసతి గదులు, క్యూలైన్ల విస్తరణ, కోడెలకు ఆధునిక గోశాలల నిర్మాణాలు, కల్యాణ మండపం వంటివి చేపడుతున్నారు. ఇప్పటికే వేములవాడ దేవస్థానం విస్తరణకు సంబంధించిన డిజైన్లపై శృంగేరీ పీఠం వారితో చర్చించారు. వారి ఆమోదం కూడా పొందారు. ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ చర్చలు జరిపారు.

మిగతా 8వ పేజీలో



సీఎం పర్యటనకు పకడ్బందీగా ఏర్పాట్లు



మాట్లాడుతున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

- కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

సిరిసిల్ల, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు వస్తున్న ముఖ్యమంత్రి పర్యటనకు అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు సమన్వయంతో పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని, విజయవంతంగా పర్యటన ముగిసేలా దృష్టి సారించాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా ఆదేశించారు. సోమవారం రాజన్న సిరిసిల్ల జిల్లా అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. బుధవారం ఉదయం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వేములవాడకు రానున్న నేపథ్యంలో ముమ్మరంగా ఏర్పాట్లు సాగుతున్నాయి. ఉదయం 9.15 గంటల నుంచి మధ్యాహ్నం 1.40 గంటల వరకు పర్యటన సాగనుంది. స్వామివారిని దర్శించుకొని అభివృద్ధి పనులు, సభ, కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ముఖ్యమంత్రికి సంబంధించిన ఏర్పాట్ల అధికారులతో చర్చించారు. హెలీప్యాడ్ సిద్ధం చేయాలని, షామియానాలు, బారికేడ్‌లు, భద్రత ఏర్పాట్లు, శానిటేషన్, బహిరంగ సభ వద్ద మొబైల్ టాయిలెట్, గ్యాలరీలు సిద్ధం చేయాలని అన్నారు. పోలీస్ శాఖ పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేసి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పర్యవేక్షించాలని సూచించారు. అంబులెన్స్, నిపుణులైన వైద్యులు అందుబాటులో ఉండే విధంగా సూచనలు చేశారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

నేషనల్ ప్రోగ్రాంపై సమీక్ష



మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారి వసంతరావు

తంగళ్లపల్లి, నవంబరు 18 (ఆంధ్ర జ్యోతి): తంగళ్లపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నేషనల్ ప్రోగ్రామ్‌పై జిల్లా వైద్యాధికారి వసంతరావు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షలో పీవోఎంసీహెచ్ డాక్టర్ అంజల, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ రజిత, వైద్యాధికారి డాక్టర్ స్నేహ పాల్గొన్నారు.

ముగిసిన గ్రూప్-3 పరీక్షలు

సిరిసిల్ల, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించిన గ్రూప్-3 పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. సోమవారం జిల్లాలోని 25 పరీక్ష కేంద్రాలవద్ద భారీ బందోబస్తు మధ్య పరీక్షలు నిర్వహించారు. 7062 మంది అభ్యర్థులకు 3757 మంది హాజరయ్యారు. 3305 మంది గైర్హాజరయ్యారు. 53.20 హాజరు శాతం నమోదైంది. జిల్లాలో ఆదివారం రెండు పేపర్లు నిర్వహించారు. మొదటి పేపర్‌కు 3808 మంది, రెండో పేర్‌‌కు 3794 మంది హాజరయ్యారు. సోమవారం మూడవ పేపర్ 3757 మంది రాశారు. పరీక్షల సందర్భంగా జిల్లాలో బీఎన్ఎస్ఎస్ 163 సెక్షన్ అమలు చేశారు. హోటళ్లు, జిరాక్స్ కేంద్రాలు మూసి వేశారు. ఇబ్బందులు కలగకుండా ప్రశాంతంగా పూర్తి చేశారు.

నేడు ఇందిరాగాంధీ విగ్రహ ఆవిష్కరణ

ఇల్లంతకుంట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : మండలకేంద్రంలోని బస్టాండ్ ప్రాంతంలో ఏర్పాటు చేసిన ఇందిరాగాంధీ విగ్రహాన్ని మంగళవారం ఆవిష్కరించనున్నట్లు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాఘవ రెడ్డి, నియోజకవర్గ అధికార ప్రతినిధి పసుల వెంకటి సంయుక్త ప్రకటనలో తెలిపారు. మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, కాంగ్రెస్ నాయకురాలు అనురాధ హాజరుకానున్నట్లు పేర్కొన్నారు.

సీఎం మనస్సు మార్చాలని రాజన్నకు కోడెమొక్కు

- పెండింగ్ బిల్లులు ఇప్పించాలని మాజీ సర్పంచుల వేడుకోలు

వేములవాడ కల్చరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ హయాంలో అప్పులు చేసి గ్రామ పంచాయతీల్లో అభివృద్ధి పనులు చేపట్టామని, ఆ బిల్లులను వెంటనే విడుదల చేసేలా సీఎం రేవంత్‌రెడ్డి మనస్సు మార్చాలని మాజీ సర్పంచులు సోమవారం రాజన్నకు కోడెమొక్కు చెల్లించుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ రాజన్న సిరిసిల్ల జిల్లా వ్యాప్తంగా 254 మంది మాజీ సర్పంచులు ఆయా గ్రామాల్లో అభివృద్ధి పనులు చేశారని, రైతువేదిక, శ్మశాన వాటిక, డంపింగ్‌యార్డు, క్రీడా ప్రాంగణం, గ్రామపంచాయతీ భవనం, పల్లెప్రకృతి వనం, హైమాస్ట్ లైట్లు, మన ఊరు మన బడి వంటి అభివృద్ధి పనులు చేశామని, ఎంబీ రికార్డు చేసి పెట్టామని అన్నారు. దాదాపు రెండు సంవత్సరాల కాలంలో సర్పంచులకు బిల్లు రాకపోవడంతో రాష్ట్ర వ్యాప్తంగా ఎంతో మంది సర్పంచులు ఆత్మహత్య చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడి 11 నెలలు గడుస్తున్నా సర్పంచుల పెండింగ్ బిల్లులపై ప్రభుత్వం స్పందించకపోవడం బాధాకరమన్నారు. వెంటనే పెండింగ్ బిల్లులు చెల్లించే విధంగా రాష్ట్ర సీఎం మనస్సు మార్చాలని, సర్పంచులపైన కరుణ చూపేలా సీఎంను ఆశీర్వదించాలని రాజన్నను వేడుకున్నామన్నారు. అక్కనపల్లి కరుణాకర్, బొజ్జ మల్లేశం,గున్నాల లక్ష్మణ్, చల్ల నారాయణ, తాడెపు ఎల్లం, కీర్తిరెడ్డి వెంకట నర్సింహరెడ్డి, శ్రీనివాస్‌రావు తదితరులు ఉన్నారు.



రాజన్నకు కోడెమొక్కు చెల్లించుకుంటున్న మాజీ సర్పంచులు

పేదలకు మెరుగైన వైద్యం

ఎల్లారెడ్డిపేట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): పేదలకు మెరుగైన వైద్యం అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతోపాటు పలు గ్రామాల్లోని లబ్ధిదారులకు మంజూరైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను స్థానిక నాయకులతో కలిసి సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నర్సయ్య మాట్లాడుతూ పేదలకు ఖరీదైన వైద్యం అందించడం కోసం సర్కారు అధిక నిధులు కేటాయిస్తోందన్నారు. మండలంలోని లబ్ధిదారులకు రూ. 9.25 లక్షల చెక్కులు మంజూరయ్యాయన్నారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మారెడ్డి, రాంరెడ్డి, చిన్నలక్ష్మీ, శ్రీనివాస్, బాబు, కిషన్, రాములు, గోపాల్, శ్రీపాల్‌రెడ్డి, బుచ్చాగౌడ్, చందు, శోభ తదితరులు పాల్గొన్నారు.

'జాల' కథల సంపుటికి కర్ణాటక పురస్కారం

సిరిసిల్ల, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రకటించిన రాష్ట్ర స్థాయి కూవెంపు భాషా భారతి పురస్కారాల్లో అనువాద విభాగంలో జాల కథల సంపుటి ఎంపికైంది. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రానికి చెందిన ప్రముఖ రచయిత పెద్దింటి అశోక్‌కుమార్ రాసిన 12 కథలను బెంగుళూరుకు చెందిన రచయిత్రి ఎంజీ శుభమంగళ కన్నడంలోకి అనువదించారు. వంశీ పబ్లికేషన్స్ జాల పేరుతో సంకలనంగా తీసుకొచ్చారు. దీనికి కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వం అనువాద విభాగంలో పురస్కారాన్ని ప్రకటిం చింది. అనువాదకురాలికి రూ.25 వేల నగదు, పురస్కారం అంద జేయనున్నారు.

విద్యార్థులు జీవితంలో ఎదగాలి

వీర్నపల్లి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు కష్టాలను ఇష్టాలుగా మలుచుకోవాలని, కన్నీళ్లను దిగమింగి జీవితంలో ఎదగాలని జేఎన్‌టీయూ విద్యార్థి నేత ఎరవెల్లి జగన్ అన్నారు. వీర్నపల్లి మండలంలోని గర్జనపల్లి ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు సోమవారం హైదరాబాద్ జేఎన్‌టీయూ అందించిన నోటు పుస్తకాలను పంపిణీ చేశారు. నవ సమాజ నిర్మాణంలో విద్యార్థులే కీలకం అన్నారు. ప్రధానోపాధ్యాయులు వెంగల శ్రీనివాస్, భూక్య గజన్, అసిస్టెంట్ ప్రొఫెసర్ సమాధాన కుమారి, డాక్టరు మహేశ్వరి, రమ్య, స్కూల్ డెవలప్‌మెంట్ కమిటీ చైర్మన్ రాకేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర కుటుంబ సర్వే గడువు పొడిగించాలి

చందుర్తి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఇంటింటి సమగ్ర కుటుంబ సర్వే గడువును మరో పది రోజులు పొడిగించాలని టీపీటీఫ్ చందుర్తి మండల అధ్యక్షులు తాటికొండ సంజీవ్ కుమార్ ఒక ప్రకటనలో సోమవారం పేర్కొన్నారు. సర్వేలో ఇచ్చిన 75 ప్రశ్నలకు కుటుంబ యజమాని నుంచి సమాధానాలు సేకరించి ఫారం పూర్తి చేసే సరికి 30 నుంచి 45 నిమిషల సమయం పడుతోందన్నారు. రోజుకు 5 నుంచి 10 కుటుంబాల సర్వే మాత్రమే ఎన్యూమరేటర్లు చేయగలు గుతున్నారన్నారు. సాయంత్రం పూట సర్వేతో మహిళా ఉద్యోగులు ఇబ్బంది పడుతున్నారన్నారు. ఒక్కొక్కరికి 150 నుంచి 180 కుటుంబాల సర్వే బాధ్య తను ఇవ్వడంతో ఎన్యూమరేటర్లు తీవ్ర ఒత్తిడికి లోనవుతున్నారన్నారు.. వీట న్నిటిని పరిగణనలోకి తీసుకొని ప్రభుత్వం సర్వే గడువును మరో పది రోజులు పొడిగించాలని కోరారు. ఈ కార్యక్రమంలోలో ఉపాధ్యాయ సంఘ నాయకులు కోత్తూరి శ్రీధర్, మందాడి శ్రీనివాస రెడ్డి, ఎడ్ల కృష్ణ చైతన్య పాల్గొన్నారు.

వేములవాడను సుందరంగా తీర్చిదిద్దుతాం

- రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ప్రముఖ పుణ్యక్షేత్రమైన వేములవాడ పట్టణాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతామని స్థానిక శాసనసభ్యుడు, రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. ఈనెల 20వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వేములవాడలో పర్యటించనున్న నేపథ్యంలో సోమవారం వేములవాడ పట్టణంలోని మహాలింగేశ్వర గార్డెన్స్‌లో కాంగ్రెస్ కార్యకర్తలతో విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 10 ఏళ్లపాటు అధికారంలో ఉన్న కేసీఆర్ రాజన్న ఆలయ అభివృద్ధికి ఏటా వందకోట్ల రూపాయలు కేటాయిస్తానని సాక్షాత్తు రాజరాజేశ్వరస్వామి వారినే మోసం చేశారని, మిడ్ మానేరు నిర్వాసితులకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల నిర్మాణం కోసం ఐదు లక్షల నాలుగు వేల రూపాయలు మంజూరు చేస్తానని గుడిమెట్ల మీద మాట ఇచ్చి తప్పారని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎలాంటి హామీ ఇవ్వకుండా రాజన్న ఆలయ అభివృద్ధికి కట్టుబడి ఇటీవల బడ్జెట్‌లో 50 కోట్ల రూపాయలను కేటాయించారని, ఆలయ అభివృద్ధితోపాటు పట్టణాన్ని సుందరీకరించడానికి నిధులు మంజూరు చేశారని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వేములవాడ పర్యటన సందర్భంగా పలు అభివృద్ధి కార్యక్రమాలు, శంకుస్థాపన కార్యక్రమాలలో పాల్గొంటారని తెలిపారు. కేసీఆర్ గతంలో ఏటా 100 కోట్లు కేటాయిస్తామని మోసం చేసి రంగు రంగుల బ్రోచర్లతో కాలం వెల్లదీశారని, తాము ఎక్కడా చెప్పకున్నా 50 కోట్లు కేటాయించామని, రాజన్న ఆలయం, వేములవాడ పట్టణ అభివృద్ధి సమాంతరంగా ఉంటుందని అన్నారు. 2014 ముందు రాజన్న ఆలయం ఎలా ఉందో ఇప్పుడు కూడా అలానే ఉందని, 2018 జూన్‌లో ముంపు గ్రామాల ప్రజలకు ఆశలు కల్పిస్తూ డబుల్ బెడ్ రూం ఇళ్ల కింద 5 లక్షల 4 వేలు ఇస్తానని కేసీఆర్ ప్రకటించడంతో ఆనాడు ఎమ్మెల్యేలకు, ముఖ్యమంత్రి చిత్రపటాలకు క్షీరాభిషేకాలు చేశారని, ఏండ్లు గడుస్తున్నా ఏ ఒక్కరికి కూడా రూ.5 లక్షల పరిహారం ఇవ్వలేదని విమర్శించారు. ముంపు గ్రామాల సమస్యలు పరిష్కారం కోసం పీసీసీ అధ్యక్షుడి హోదాలో రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ నేతలు భట్టి విక్రమార్క, పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు, మేడిపల్లి సత్యం, అడ్లూరి లక్ష్మణ్, కవ్వంపల్లి సత్యనారాయణ తదితరులు అనేక పోరాటాలు చేశారని, రేవంత్ రెడ్డి సంకెపల్లిలో పల్లె నిద్ర చేసి ముంపు గ్రామాల ప్రజలకు భరోసా కల్పించారని గుర్తు చేశారు. ఆనాడు ఇచ్చిన మాట ప్రకారం ముంపు గ్రామాల ప్రజలకు 4696 ఇళ్లకు రూ.230 కోట్లను మంజూరు చేశారని వెల్లడించారు.



సమావేశంలో మాట్లాడుతున్న విప్ ఆది శ్రీనివాస్

నేతన్నల 30 సంవత్సరాల చిరకాల కోరిక యారన్ డిపోను కాంగ్రెస్ ప్రభుత్వం 50 కోట్ల రూపాయలతో వేములవాడలో కేటాయించిందని, గత ప్రభుత్వంలో నంబరు టూగా ఉన్న కేటీఆర్ సైతం యారన్ డిపో తీసుకరాలేకపోయారని అన్నారు. వేములవాడలో మూల వాగుపై బ్రిడ్జి నిర్మాణాలు ప్రారంభించి ఏళ్లు గడుస్తున్నా 3వ బ్రిడ్జికి భూసేకరణ కూడా చేపట్టలేదని, భూసేకరణ కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ఇటీవల రూ.6 కోట్ల నిధులు మంజూరు చేసిందని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు ప్యాకేజీ 9లో భాగంగా మల్కపేట రిజర్వాయర్‌లో మిగిలిపోయిన పనులకు 9 కోట్లు మంజూరు చేసిందన్నారు. 2018 ఎన్నికలలో తనను ఓడించడానికి హరీష్ రావు కలికోట సూరమ్మ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారని, ఐదేళ్లు గడిచినా గజం పని కూడా కాలేదని తట్టెడు మట్టి కూడా తీయలేదని అన్నారు. కలికోట సూరమ్మ చెరువు కుడి, ఎడమ కాలువల భూసేకరణ కోసం తాజాగా రూ.10 కోట్ల నిధులు మంజూరు చేశామన్నారు. సూరమ్మ చెరువు ప్రాజెక్టులో కోల్పోయిన బోరు బావులకు, మర్రిపల్లి రిజర్వాయర్, లచ్చపేట రిజర్వాయర్, మిగిలిన భూసేకరణ కోసం రూ.4 కోట్లు నిధులు మంజూరు చేశామని తెలిపారు. 10 ఏళ్ల పాలనలో తీవ్ర నిర్లక్ష్యానికి గురైన వేములవాడ నియోజకవర్గంలో ప్రజా ప్రభుత్వం నేతృత్వంలో అభివృద్ధి పనులను వేగవంతం చేస్తున్నామని, ఈనెల 20వ తేదీన ఉదయం 10.30 గంటలకు వేములవాడ పట్టణంలోని గుడి చెరువు ప్రాంగణంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బహిరంగ సభలో పాల్గొంటారని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బహిరంగ సభకు భారీ సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ గౌడ్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు చంద్రగిరి శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు.

క్రైం కార్నర్

ప్రమాదవశాత్తు రైలు కిందపడి వృద్ధురాలి మృతి

ఓదెల, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఓదెల రైల్వే స్టేషన్‌లో సోమవారం పెద్దపల్లి మండలం కనగర్తికి చెందిన అరికిళ్ల నర్సమ్మ (60) అనే వృద్ధురాలు ప్రమాదవశాత్తు ఇంటర్ సిటీ రైలు కిందపడి మృతి చెందింది. ఓదెలలోని తన బంధువుల ఇంటిలో పెద్దఖర్మ కార్యక్రమానికి హాజరయ్యేందుకు ఇంటర్ సిటీ రైలులోతన భర్త నర్సయ్యతో ఓదెలకు వచ్చింది. రైల్వే స్టేషన్‌లో రైలు నుంచి దిగుతుండగా అకస్మాత్తుగా రైలు వేగం పుంజుకుంది. దీంతో ప్రమాదవశాత్తు కాలు జారడంతో రైలుకింద పడి అక్కడికక్కడే మృతి చెందింది. రైలు కనీసం నిమిషం పాటు ఆగినా వృద్ధురాలి ప్రాణాలు దక్కేవని అక్కడున్న పలువురు ఆవేదన వ్యక్తం చేశారు.

చికిత్స పొందుతూ...

మానకొండూర్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శ్రీనివాస్‌నగర్ గ్రామానికి చెందిన బొద్దు పోచమ్మ (85) అగ్నిప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారుజామున మృతి చెందింది. శ్రీనివాస్‌నగర్ గ్రామానికి చెందిన పోచమ్మ ఆదివారం సాయంత్రం ఇంట్లో మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో మంటలు పోచమ్మకు అంటుకుని తీవ్రంగా గాయపడింది. కుటుంబ సభ్యులు పోచమ్మను కరీంనగర్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ తెల్లవారు జామున మృతి చెందింది. తన తల్లి మృతిపై అనుమానం ఉందని పోచమ్మ కుమార్తె అలువాల లచ్చమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ లక్ష్మీనారాయణ తెలిపారు.

బావిలో దూకిన వృద్ధురాలు

హుజూరాబాద్‌రూరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలోని దమ్మక్కపేటకు చెందిన కొండ బత్తిని రాజేశ్వరి(65) బావిలో దూకింది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజేశ్వరి భర్త రాజాకిషన్ గత14 సంవత్సరాలుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఆయనకు సేవ చేస్తూ మనస్తాపానికి గురైన రాజేశ్వరి సోమవారం ఉదయం బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. గమనించిన కుటుంబ సభ్యులు అగ్నిమాపక అధికారులకు సమాచారం అందించారు. వారు ఘటన స్థలానికి చేరుకొని మోటార్ల సహాయంతో నీటిని తోడుతున్నారు. సాయంత్రం వరకు మృతదేహం లభించలేదు.

కొడుకు మృతి తట్టుకోలేక తండ్రి ఆత్మహత్య

ఇల్లందకుంట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్న కోమటిపల్లి గ్రామానికి చెందిన మూడెండ్ల రవి (48) పురుగుల మందు తాగి చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రవి కుమారుడు రెండు నెల క్రితం మృతి చెందాడు. అప్పటి నుంచి రవి ముభావంగా ఉంటున్నాడు. ఈ నెల 16న పొలం వద్దకు వెళ్తున్నానని చెప్పి ఇంటి నుంచి వెళ్లిపోయి రాత్రి అక్కడ పురుగుల మందు తాగాడు. తెల్లవారు జామున గమనించిన కుటుంబ సభ్యులు జమ్మికుంటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందాడు. రవిడి భార్య రజిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజకుమార్ తెలిపారు.

ఉరి వేసుకొని వ్యక్తి ఆత్మహత్య

పెద్దపల్లిటౌన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని లక్ష్మీనగర్‌కు చెందిన సురెడ్డి దేవి ప్రసాద్‌రెడ్డి (50) అనే వ్యక్తి సోమవారం ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. దేవి ప్రసాద్‌రెడ్డి కొన్నేళ్లుగా కాటారం మండలం గంగారంలో నివాసముంటూ హైదరాబాద్‌లో వ్యాపారం చేస్తున్నాడు. తనకు పెద్దపల్లిలో సొంత ఇళ్లు ఉంది. ఆ ఇంటిని గణేష్‌రెడ్డి అనే వ్యక్తి ఐదు లక్షల రూపాయలు అడ్వాన్స్‌గా తీసుకొని అద్దె లేకుండా ఇళ్లు అప్పగించాడు. సోమవారం పెద్దపల్లికి వచ్చిన ప్రసాద్‌రెడ్డి గణేష్‌కు ఫోన్‌చేసి ఇంటి తాళాలు తెప్పించుకొని నాలుగు గంటల వరకు ఇక్కడే ఉంటానని.. తర్వాత వచ్చి ఇంటికి తాళం వేసుకోమని గణేష్‌కు చెప్పాడు. దేవీప్రసాద్‌రెడ్డి భార్య రమ భర్తకు పలుమార్లు ఫోన్ చేసినా లిఫ్ట్ చేయలేదు. నాలుగు గంటల సమయానికి గణేష్ వచ్చి డోర్లు కొట్టినా దేవీప్రసాద్‌రెడ్డి తలుపులు తీయకపోవడంతో కిటికిలోంచి చూసే సరికి ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఉన్నాడు. వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఆత్మహత్యకు గల పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. ఏఎస్సై రామస్వామి వచ్చి ఘటన వివరాలు సేకరించారు. దేవి ప్రసాద్‌రెడ్డి మృతిపై పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

గంజాయి కేసులో ఐదుగురు నిందితులకు జైలు శిక్ష

కరీంనగర్ క్రైం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లో 2020, నవంబరు 10న జ్యోతినగర్‌లోని శివ టాకీసు వద్ద వాహనాల తనిఖీలో గంజాయితో పట్టుబడిన నిందితులకు కరీంనగర్ జిల్లా ఫస్ట్ అడిషనల్, సెషన్స్ కోర్టు సోమవారం ఐదు సంవత్సరాల జైలు శిక్ష, రూ.10వేల జరిమాన విదిస్తూ తీర్పు వెలువరించారు. కరీంనగర్ రెండో ఠాణ సీఐ విజయ్‌కుమార్ తెలిపారు. నిందితుల్లో ఒకరైన జాడి అజయ్ చనిపోగా, మిగిలిన నిందితులు సంగారెడ్డి జిల్లా వట్టిపల్లి మండలానికి చెందిన ఎర్రోల్ల రమేశ్, పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలం రామారావుపల్లి గ్రామానికి చెందిన అన్నం కృష్ణ, రామడుగు మండలం వన్నారం గ్రామానికి చెందిన దుర్గం శ్రీధర్, కొతపల్లికి చెందిన మాడిశెట్టి రాజ్‌కుమార్‌లకు కోర్టు 5 ఏళ్ళ జైలుశిక్ష, పది వేల రూపాయల జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

జమ్మికుంట రూరల్, నవంబర్ 18: జమ్మికుంట పట్టణ పరిధిలోని హౌసింగ్‌బోర్డు కాలనిలో తాళంవేసి ఉన్న ఇంట్లో దొంగతనం జరిగింది. రాజేందర్ అనే వ్యక్తి తన ఇంటికి తాళం వేసి స్వగ్రామం చెల్పూర్‌కు వెళ్లాడు. ఆదివారం అర్ధరాత్రి సమయంలో దొంగలు ఇంటి తాళం పగులగొట్టి పదితులాల వెండి, ఐదు గ్రాముల బంగారు కమ్మలు, వెండి ప్రమిదలు, దుస్తులు ఎత్తుకెళ్లారు. వాటి విలువ రూ. 98 వేలు ఉంటుందని, ఇంటి యాజమాని ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ వరంగంటి రవికుమార్ తెలిపారు.

మహిళపై తెగిపడిన కరెంటు తీగ

● తప్పిన పెనుప్రమాదం

సుల్తానాబాద్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ట్యాంక్ రోడ్‌లో జన నివాసంలో ప్రమాదకరంగా ఉన్న ఎస్ఎస్-1 ట్రాన్స్ ఫార్మర్ నుంచి పెంట రేణుక అనే మహిళ మీద కరెంటు వైర్ తెగి పడింది. సోమవారం ఉదయం మహిళా తన ఇంటి ఎదుట వాకిట్లో ముగ్గు వేస్తుండగా కరెంటు తీగ తెగిపడింది. తీగ ఆమె చీర చివరను తాకుతూ వెళ్లడంతో తృటిలో పెనుప్రమాదం తప్పింది. ఆమె చీర కొంత వరకు కాలగా, చుట్టు పక్కల వాసులు ట్రాన్స్‌ఫార్మర్ ఎప్పుడు ఎవరి ప్రాణాలు బలిగొంటుందో అని భయాందోళన చెందుతున్నారు. ఇలాంటి సంఘటనలు ఇదివరకు కూడా జరిగాయని, కేవలం ప్రత్యామ్నాయ పనులు మాత్రమే చేస్తున్నారని, శాశ్వత పరిష్కారాన్ని చూపించాలని వారు కోరుతున్నారు. అధికారులు పట్టించుకుని ట్రాన్స్ ఫార్మర్‌ను వేరే ప్రాంతానికి తరలించాలని విద్యుత్ అధికారులను ప్రజలు కోరుతున్నారు.

బైండోవర్ ఆంక్షలు ఉల్లంఘన

● లక్ష రూపాయల జరిమానా

పెద్దపల్లిటౌన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి మండలంలోని బొంపెల్లి గ్రామానికి చెందిన బోదాసు కనుకలక్ష్మి అనే మహిళ గుడుంబా విక్రయించినందుకు తహసీల్దార్ లక్ష రూపాయల జరిమానా విధించినట్లు ఎక్సైజ్ సీఐ నరేందర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో విధించిన బైండోవర్ అంక్షలన ఉల్లంఘించినందున జరిమానా వేసినట్లు తెలిపారు. ఎవరైన గుడుంబా విక్రయించిన, రవాణ చేసిన, తయారు చేసిన లక్ష రూపాయల జరిమానా లేదా ఏడాది జైలు శిక్ష విధించబడుతుందని సీఐ హెచ్చరించారు.

సీఎం పర్యటనకు భారీ ఏర్పాట్లు

- రేపు 'రాజన్న' దర్శనం.. బహిరంగ సభ
- గల్ఫ్ బాధిత కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా
- యారన్ డిపో, ఎస్పీ కార్యాలయం ప్రారంభోత్సవం
- రూ.126 కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం





వేములవాడ గుడి చెరువు మైదానంలో బహిరంగ సభ ఏర్పాట్లు



సిరిసిల్ల, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వరస్వామి దేవస్థానానికి తొలిసారిగా ముఖ్యమంత్రి హోదాలో రేవంత్‌రెడ్డి రానున్న నేపథ్యంలో అధికార యంత్రాంగం భారీ ఏర్పాట్లు చేస్తోంది. బుధవారం ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించి ఇప్పటికే బీసీ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా ఏర్పాట్లపై దృష్టి సారించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బుధవారం ఉదయం వేములవాడకు హెలికాప్టర్ ద్వారా చేరుకొని రాజ రాజేశ్వరస్వామిని దర్శించుకుంటారు. అనంతరం గుడి చెరువు మైదానంలో బహిరంగ సభలో ప్రసంగిస్తారు. ఇదే క్రమంలో రూ.126 కోట్లతో వేములవాడ దేవస్థానానికి సంబంధించిన అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తారు. నిధులకు సంబంధించిన జీవోలు కూడా సోమవారం జారీ చేశారు. మిడ్ మానేరు ప్రాజెక్ట్‌లో ముంపునకు గురైన 12 గ్రామాల నిర్వాసితు లకు సంబంధించి 4696 కుటుంబాలకు ఇళ్ల నిర్మాణా నికి రూ.237 కోట్ల నిధులు మంజూరు చేశారు. వీటికి సంబంధించి ప్రొసీడింగ్‌లు అదించే అవకాశం ఉంది. ఎంతో కాలంగా నేత కార్మికులు ఎదురుచూస్తున్నా యారన్‌డిపోను ప్రారంభించనున్నారు. సిరిసిల్ల జిల్లా కేంద్రంలో జీ-ప్లస్ 2 విధానంలో అధునిక వసతులతో నిర్మించిన జిల్లా పోలీస్ కార్యాలయాన్ని వేములవాడ నుంచి వర్చువల్ విధానంలో ప్రారంభిస్తారు. పోలీస్ కార్యాలయం ఇప్పటికే మూడుసార్లు వాయిదా పడడం గమనార్హం. ముఖ్యమంత్రి రాకకు సంబంధించి వేములవాడలో భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. హెలీప్యాడ్ తోపాటు భారీ షామీయానాలు సిద్ధం చేశారు.

గల్ఫ్ బాధిత కుటుంబాలకు ఆర్థిక సహాయం

కాంగ్రెస్ అధికారంలోకి రావడంతోనే గల్ఫ్ కార్మికులు, ఎన్ఆర్ఐల సంక్షేమంపై పాలసీ తీసుకొస్తామని ప్రకటించింది. ఇచ్చిన హామీ మేరకు గల్ఫ్ బాధిత కుటుంబాలకు రూ.5లక్షల ఆర్థిక సహాయం అందించడానికి శ్రీకారం చుట్టింది. డిసెంబరు 7, 2023 నాటి నుంచి గల్ఫ్‌లో మృతిచెందిన కార్మిక కుటుంబాలకు రూ.5లక్షల అర్థికసహాయం అందించాలని నిర్ణయించారు. ఈ మేరకు బుధవారం వేములవాడలో బహిరంగ సభలో సీఎం రేవంత్‌రెడ్డి రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన 17కుటుంబాలకు చెక్కులు అందించనున్నారు. ఇందుకోసం ప్రభుత్వం రూ.85 లక్షలు కేటాయించింది. జిల్లాలో గల్ఫ్‌లో మృతిచెందిన కార్మికుల్లో గంగిపెల్లి తిరుపతి, దాసరి బాబు, కైర నాగయ్య, పోతుగంటి భూమయ్య, బైరి వెంకటేశం, ఎనుగుల భాస్కర్, బోయిని గణేష్, కారవాణి దేవయ్య, విక్కుర్తి ఎల్లంగౌడ్, పిట్ల మహేష్, గెరిగంటి అంజయ్య, సిలివేరి నాంపల్లి, దురిశెట్టి కొండయ్య, పెండ్యాల చంద్రకాంత్, మాదాసు విజయ్, పల్లి అంజయ్య, నిమ్మలరాజు ఉన్నారు. వీరి కుటుంబాలకు ముఖ్య మంత్రి చేతులమీదుగా చెక్కులు అందించే ఏర్పాట్లు చేశారు.

ధాన్యం కొనడం లేదని రైతుల ఆందోళన

● గోనె సంచులకు నిప్పుపెట్టి నిరసన

సైదాపూర్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): సైదాపూర్ మండలంలోని వెన్నంపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) వద్ద గోనెసంచులు యివ్వడం లేదని రైతులు సోమవారం ఆందోళన చేపట్టారు. అసహనానికి గురైన రైతులు గోనె సంచులను గడ్డిలో వేసి సొసైటీ గేటు ఎదుట తగలబెట్టి నిరసన తెలిపారు. చైర్మన్ బిల్ల వెంకట్రెడ్డిని సంచులు ఎందుకు ఇవ్వడం లేదని, ధాన్యం తూకాలు వేయడంలో ఎందుకు ఆలస్యం చేస్తున్నారని రైతులు నిలదీశారు. వెంటనే ధాన్యం తూకం వేయాలని డిమాండ్ చేశారు. తూకం వేసిన ధాన్యాన్ని మిల్లులకు తరలించేందుకు లారీలు తెప్పించడం లేదని, ట్రాక్టర్ తో ధాన్యం తరలించడం వల్ల రైతులపై రవాణా చార్జీలు అదనంగా పడుతున్నాయని రైతులు తెలిపారు. సొసైటీలో అనేక అవకతవకలు జరుగుతున్నాయని, దానిపై విచారణ చేపట్టాలని రైతులు డిమాండ్ చేశారు. పది రోజులుగా రైతులు ఇబ్బంది పడుతుంటే పై అధికారులు కానీ, ప్రజా ప్రతినిధులు గాని ఎందుకు పట్టించుకోవడంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి సొసైటీ చైర్మన్, పాలకవర్గం, సిబ్బందిపై చర్యలు తీసుకొని సమస్యను పరిష్కరించాలని కోరారు.



ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం వద్ద నిరసన తెలుపుతున్న రైతులు

వేంకటేశ్వర స్వామి ఆలయ హుండీ లెక్కింపు

కోరుట్ల రూరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వెంకటాపూర్ వేంకటేశ్వర ఆలయ హుండీ లెక్కింపు సోమవారం దేవాలయ శాఖ, గ్రామ పెద్దల సమక్షంలో నిర్వహించారు. దేవాలయ - ధర్మాదాయశాఖ జగిత్యాల డివిజన్ ఇన్‌స్పెక్టర్ రాజమౌళి పర్యవేక్షనలో ఆలయ ఈవో విక్రం ఆధ్వర్యంలో హుండీ సొమ్ము లెక్కించారు. దేవాలయ ఆదాయం రూ. 73,365 నగదు, మిశ్రమ బంగారం 2 గ్రాముల 300 మిల్లీ గ్రాములు, మిశ్రమ వెండి 80 గ్రాములు వచ్చినట్లు అధికారులు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ తోట లింగారెడ్డి, దేవాలయ పురోహితుడు వెంకటరమణ, దేవాలయ చైర్మెన్ కటుకం రాజేశం, గ్రామస్థులు, భక్తులు ద్యాగ రాజిరెడ్డి, పోతుగంటి రాజేశం గౌడ్, పిట్టల రమేష్, బక్కం నర్సయ్య పాల్గొన్నారు.



హుండీ లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

భర్త ఇంటి ఎదుట భార్య ఆందోళన



కూతురు, కుమారుడితో కలిసి ఆందోళన చేస్తున్న వనిత

కోరుట్ల, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : పిల్లలతో పాటు తనను మానసిక వేదనకు గురిచేస్తూ మరో అమ్మాయిని పెళ్లి చేసుకున్నాడని ఆరోపిస్తూ భర్త ఇంటి ఎదుట వివాహిత తన పిల్లలతో సోమవారం ఆందోళకు దిగింది. బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం... కోరుట్ల పట్టణానికి చెందిన వినోద్ కుమార్‌తో 24 ఏళ్ల క్రితం పట్టణానికి చెందిన వనితకు వివాహం అయింది. దంపతులకు కొడుకు మనీష్, కూతురు మాళవిక ఉన్నారు. మూడేళ్ల క్రితం నుంచి భర్త వినోద్ కుమార్ పిల్లలతో పాటు భార్య వనితను మానసికంగా హింసిస్తున్నాడు. వేధింపులు భరించలేక వనిత తన పిల్లలతో కలిసి పట్టణంలో మరో ఇల్లు అద్దెకు తీసుకుని ఉంటోంది. నాలుగు నెలల క్రితం వినోద్ కుమార్ మరో మహిళను వివాహం చేసుకున్నాడని తెలుసుకున్న వనిత భర్తను నిలదీసింది. తనకు తెలియకుండా మరో పెళ్లి చేసుకున్నాడని, ఇంటి ఖర్చులకు కూడా డబ్బులు ఇవ్వడం లేదని తనకు న్యాయం చేయాలని సోమవారం ఆందోళనకు దిగింది. వివాహిత చేస్తున్న ఆందోళనకు మహిళా సంఘ సభ్యులు మద్దతు పలికారు. ఆందోళ చేస్తున్న విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడ చేరుకుని ఆమెను సముదాయించి ఆందోళన విరమించాలని సూచించారు. అనంతరం పోలీసులు దంపతులకు కౌన్సెలింగ్ ఇచ్చి పంపిచేశారు.

జాతీయ స్థాయి క్రీడలకు ఎంపిక



దిలీప్

బీర్‌పూర్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మంగేళ గ్రామానికి చెందిన ఇంటర్ విద్యార్థి జాతీయస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైయ్యాడు. బీర్‌పూర్ మండలంలోని మంగేళ గ్రామం నుంచి నూతన గ్రామ పంచాయతీగా ఏర్పడిన గోండు గుడెం గ్రామపంచాయతీకి చెందిన శకుంతల దిలీప్ ములుగు జిల్లాలో ఇంటర్ రెండవ సంవత్సం చదువుతున్నాడు. దిలీప్‌కు చిన్నా నాటి నుంచి కబడ్డీ అంటే ఇష్టం ఉండంతో క్రీడలపై ఉన్న మక్కువతో జిల్లా, రాష్ట్ర స్థాయిలో పతకాలను సాధించి హర్యానా రాష్ట్రంతో జరుగబోయే జాతీయస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక అయ్యాడు. అంతే కాకుండా రాష్ట్ర జట్టుకు ప్రాతినిత్యం (కెప్టెన్)గా బాధ్యత వహిస్తున్నాడు. దిలీప్ జాలీయ స్థాయి క్రీడలకు ఎంపికై రాష్ట్ర జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించనుండడంతో తల్లి దండ్రులు, స్నేహితులు, మండల నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

జోనల్ మీట్‌లో గురుకులం విద్యార్థినుల ప్రతిభ



పతకాలు సాధించిన విద్యార్థులు

తంగళ్లపల్లి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లాలో నిర్వహించిన తెలంగాణ గురుకుల బాలికల పాఠశాల, కళాశాలల 10వ జోనల్ మీట్‌లో తంగళ్లపల్లి మండలం బద్దెనపల్లి గురుకుల పాఠశాల, కళాశాల విద్యార్థినులు ప్రతిభ కనబరిచారు. అండర్-14 విభాగంలో ఖో, ఖోలో ప్రథమస్థానం, అండర్-17 విభాగంలో బ్యాడ్మింటన్ జట్టు ప్రథమస్థానం, అండర్-19 విభాగంలో బ్యాడ్మింటన్ జట్టు ప్రథమ స్థానాల్లో నిలిచాయి. హ్యాండ్‌బాల్ జట్టు ద్వితీయ స్థానం సాధించింది. అథ్లెటిక్స్ అండర్-17లో హైజంప్‌లో రుషిత గోల్డ్‌మెడల్, డిస్క్ త్రోలో శరణ్య సిల్వర్ మెడల్, 3కే రన్‌లో సుచరిత సిల్వర్ మెడల్ కైవసం చేసుకున్నారు. ఈ సదర్భంగా సోమవారం మార్నింగ్ అసెంబ్లీలో ప్రిన్సిపాల్ పద్మ, వైస్ ప్రిన్సిపాల్ రమ్యకృష్ణ, జూనియర్ వైస్ ప్రిన్సిపాల్ వింధ్య మాలతి, పీడీ అలేఖ్య, పీఈటీ జ్యోతి విద్యార్థినులను అభినందించారు.

ఇద్దరిపై కేసు నమోదు

కరీంనగర్ క్రైం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): పోలీస్ సైరన్ వేసుకొని వెళ్తున్న ఒక కారు డ్రైవర్‌తో పాటు రాయల్ ఎన్‌ఫీల్డ్ సైలెన్సర్ మార్చి తిరుగుతున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ పోలీసులు తెలిపారు. కారు, రాయల్ ఎన్‌ఫీల్డ్ సీజ్ చేసి స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు.

విగ్రహాల తయారీతో ఉపాధి

● మహనీయులు, దేశ నేతలు, దేవుళ్ల విగ్రహాల తయారీ

వేములవాడటౌన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): చిన్నతనం నుంచి చిత్రకళ ఇష్టం. దానితోపాటు మట్టితో విగ్రహాలను చేయడం అలవాటుగా చేసుకున్నాడు. ఇప్పుడు అదేకళను ఉపాధిగా మార్చుకున్నాడు. దేశ నేతలు, దేవుళ్ల విగ్రహాల తయారీతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నాడు. వేముల వాడ మండలం సంకెపల్లికి చెందిన బుర్రవేణు చిన్నప్పటి నుంచి చిత్రకళ, శిల్ప కళపై దృష్టి సారించాడు. పెద్దపల్లి సత్యంఅనే సీనియర్ శిల్పకారుడి వద్ద చేరి శిల్పకళలోని మెళకువలను తెలుసుకున్నాడు. చిత్రకళలో పోటీ ఎక్కువగా ఉండడంతో వేణు విగ్రహాల తయారీవైపు దృష్టిసారించాడు. మహనీయులు, దేశ నేతలు, దేవతల విగ్రహాల తయారీలో తనకంటూ ప్రత్యేక గుర్తింపును తెచ్చుకున్నాడు. దేశ నేతలైనగాంధీ, అంబేద్కర్, అల్లూరి సీతరామారాజు, ఛత్రపతి శివాజీ విగ్రహాల తయారీతో అందరి దృష్టిని ఆకర్షించాడు. అతడితోపాటు మరో ఎనిమిది మంది యువకులకు ఉపాధి కల్పిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నాడు. తమిళనాడు, మహారాష్ట్రతో పాటుగా తెలుగు రాష్ట్రాల్లోని నిజామాబాద్, సిద్దిపేట, మెదక్, కామారెడ్డి, హైదారాబాద్, రంగారెడ్డి, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, జగిత్యాల, కర్నూల్, కడప, విజయవాడ జిల్లాలో సుమారుగా 1800 వరకు విగ్రహాలను తయారు చేసినట్లు వేణు తెలిపాడు.



నాలుగు సింహాల విగ్రహం



శివుడి విగ్రహంతో బుర్ర వేణు



బుర్ర వేణు తయారు చేసిన దొడ్డి కొమురయ్య విగ్రహం

పలువురికి ఉపాధి కల్పిస్తున్నా..

మాది నిరుపేద గీతకార్మిక కుటుంబం. మొత్తం ఆరుగురం సభ్యులం. చిన్నతనం నుంచి చిత్ర కళ ఆసక్తి. కుటుంబ పరిస్థితి బాగాలేక శిల్పాలు తయారీ నేర్చుకున్నా. అన్ని జిల్లాల నుంచి ఆర్డర్లు వస్తాయి. ప్రస్తుతం పలువురికి ఉపాధి కల్పిస్తున్నా.

\- బుర్ర వేణు, శిల్పకారుడు, సంకెపల్లి


నిరాశ్రయుల వసతి గృహంలో వృద్ధులు


నిరాశ్రయుల వసతి గృహం

నీడలేని వారికి అండగా..

- అభాగ్యులను ఆదుకుంటున్న నిరాశ్రయుల వసతి గృహం
- 30 మందికి భోజన వసతి

కరీంనగర్ టౌన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): పేగు తెంచుకొని పుట్టిన ఎంతోమంది కన్నబిడ్డలే తల్లిదండ్రుల ఆలనాపాలన చూడని ప్రస్తుత రోజుల్లో ఎవరూ లేని అభాగ్యులకు అండగా నిలుస్తోంది కరీంనగర్‌లోని నిరాశ్రయుల వసతి గృహం... మెప్మా ఆధ్వర్యంలో ప్రభుత్వ భవనంలో ఏర్పాటు చేసిన నగర నిరాశ్రయుల వసతి గృహం ఎంతో మంది అభాగ్యులను అక్కున చేర్చుకుంటోంది. నగరంలోని కోతిరాంపూర్‌లో రెండంతస్తుల భవనంలో మెప్మా ఆధ్వర్యంలో పట్టణ నిరాశ్రయుల వసతి గృహాన్ని ఏర్పాటు చేశారు. గతంలో ఓ స్వచ్ఛంద సంస్థకు ఈవసతి గృహం నిర్వహణ బాధ్యతను అప్పగించగా వారు అభాగ్యులను అక్కున చేర్చుకొని వారికి భోజనంతోపాటు వసతి కల్పించారు. నగరంలోని రోడ్ల పైనే నిద్రించేవారికి, ఇక్కడికి వివిధ అవసరాల మేరకు వచ్చి రాత్రికి ఇళ్లకు వెళ్లలేక రాత్రి బస చేయాలనుకునే వారికి నైట్ షెల్టర్‌గా ఈ వసతి గృహాన్ని వినియోగిస్తున్నారు. రోడ్ల పక్కన, జంక్షన్లలో, బస్టాండ్లలో రాత్రి పడుకునే అనేక మందిని పోలీసులు ఈ వసతి గృహానికి తరలిస్తారు. వారికి రాత్రి బస కల్పించి, ఉదయం వారిని బయటకు పంపిస్తారు. ఇలా దాదాపు 10 సంవత్సరాలుగా నీడలేని వారికి అండగా నిలిచిస్తోంది.

● వీబీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో..

2023 నవంబరునుంచి వీరబ్రహ్మేంద్రస్వామి ఫౌండే షన్ ఆధ్వర్యంలో ఈ వసతి గృహాన్ని నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం ఈ గృహంలో 15 మంది ఎవరూ లేని అభాగ్యులు ఆశ్రయం పొందుతున్నారు, ప్రతిరోజు మరో 15 నుంచి 20 మంది వరకు నైట్ షెల్టర్‌కు వచ్చి నిద్రిం చి ఉదయమే వెళ్లిపోతున్నారు. మెప్మా ఈ వసతి గృహం వీబీ ఫౌండేషన్‌కు నెలకు కేవలం 40వేల రూపా యలు నిర్వహణ ఖర్చులకోసం ఇస్తోంది. గత ఏడాది నుంచి వీబీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇప్పటి వరకు ఒక్క రూపాయి కూడా ఆర్థిక సహాయాన్ని తీసుకోలేదు. అయి నా ఉదయం టిఫిన్స్, మధ్యాహ్నం, రాత్రి వేళల్లో చక్క టి భోజనం, వసతి కల్పిస్తున్నారు. ఎవరికైనా ఆరోగ్య సమస్యలు తలెత్తితే ఆసుపత్రికి తీసుకెళ్లి వైద్యపరీక్షలు చేయించి అవసరమైన వారికి చికిత్సతోపాటు మందులు కూడా ఇప్పిస్తున్నారు. ఆశ్రయం పొందుతున్న 15 మందిలో నలుగురు మహిళలు కాగా, 11మంది పురు షుల. వీరిలో ఒకరు వంట మనిషిగా, మరొకరు హెల్పర్ గా సేవలందిస్తున్నారు.

● అభాగ్యులకు సేవచేయడం అదృష్టం



కొన్ని సంవత్సరాలుగా హౌసింగ్‌బోర్డుకాలనీలో శ్రీవీరబ్రహ్మేంద్రస్వామి అనాథ వృద్ధుల ఆశ్రమం నిర్వహిస్తున్నాను.. అభాగ్యులకు సేవ చేయడం అదృష్టంగా భావిస్తున్నాను. మెప్మా పీడీ రవీందర్ గత నవంబర్‌లో ఈ వసతి గృహ నిర్వహణ బాధ్యతలను అప్పగించారు. వసతిగృహంలో ఉండే వారికి ఉదయం టిఫిన్, మధ్యాహ్నం, రాత్రి భోజనం అందించాలని, రాత్రి వేళల్లో నైట్‌షెల్టర్‌గా రోడ్లపై నిద్రించే వారికి బస కల్పించాలని సూచించారు. నేను రాత్రి ఇక్కడికి వచ్చే వారికి కూడా భోజనం పెడుతున్నాను.. ఏడాది నుంచి ఇప్పటి వరకు ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు. ప్రభుత్వం పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ఆర్థిక సహాయాన్ని అందిస్తే ఎంతమందికైనా ఇక్కడ వసతి కల్పించి సేవ చేస్తా.

- సీపెల్లి వీరమాధవ్, వీబీ పౌండేషన్ చైర్మన్

● మూడేళ్లుగా ఉంటున్నా



ఎవరూ లేని నన్ను కరీంనగర్ బస్టాండ్ నుంచి తీసుకువచ్చి ఈ వసతిగృహంలో చేర్పించారు. మూడేళ్లుగా ఇక్కడే ఉంటున్నా.. అన్ని వసతులు బాగానే ఉన్నాయి. నాకు కళ్ళు కనిపించడం లేదు.. ఆపరేషన్ చేయిస్తే బాగుండు..

- రబీయా

● మూడు పూటలా భోజనం పెడుతున్నారు...



కొడుకులు, బిడ్డలు లేరు... యేడాది నుంచి నేను ఇక్కడనే ఉంటున్నా... భోజనం బాగుంటుంది. పొద్దున నాకు తిండి పెట్టి ఆశ్రయం ఇస్తున్నారు.. చల్లగా ఉండాలి.

-నర్సమ్మ

కూలీ పనిచేసుకొని జీవిస్తున్నాను



కూలీనాలీ చేసుకొని జీవిస్తున్నాను... నాకు ఎవరూ లేరు.. ఆస్తిపస్తులు ఏమి లేవు.. సంవత్సరం నుంచి ఇక్కడే ఉంటున్నా. నాకు ఆధార్‌కార్డు, రేషన్‌కార్డులు కూడా లేవు.. ప్రభుత్వం ఇలా భోజనం పెట్టించి ఆదుకుంటుంది.

- రేవెళ్ల శ్రీనివాస్

ఢిల్లీలో దోస్తీ... గల్లీలో కుస్తీ

- మహారాష్ట్ర ఎన్నికల్లో కాంగ్రెస్ విజయకేతనం
- మంత్రి పొన్నం ప్రభాకర్


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న పొన్నం ప్రభాకర్

గోదావరిఖని, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పదేళ్లలో బీజేపీతో స్నేహంచేసి ఢిల్లీలో దోస్తీ, గల్లీలో కుస్తీగా వ్యవహరించిందని రాష్ట్ర బీసీ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆరోపించారు. సోమవారం మహారాష్ట్రలోని రాజురకు ఎన్నికల ప్రచారనికి వెళుతున్న ఆయన రామగుండం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మక్కాన్ సింగ్‌తో కలిసి పొన్నం ప్రభాకర్ మాట్లాడారు. బీజేపీ, బీఆర్ఎస్ రెండూ ఒకటేనని, వారి దోస్తీ ప్రజలకు తెలుసునన్నారు. కేటీఆర్ మహారాష్ట్ర ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓటు వేయవద్దని చెప్పడం పరోక్షంగా బీజేపీకి ఓటు వేయాలనే సంకేతాన్ని ఇచ్చారన్నారు. ఈ నెల 24న మహారాష్ట్రలో జరిగే ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధిస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కేటీఆర్ కాంగ్రెస్‌కు కవచంగా ఉంటుందని మాట్లాడడం విడ్డూరంగా ఉందని, సిద్ధాంతాల పరంగా బీజేపీ కాంగ్రెస్‌కు బద్ధ శత్రువన్నారు. పదేళ్ల కాలంలో పార్లమెంట్‌లో బీజేపీ ఏ బిల్లు ప్రవేశపెట్టినా బీఆర్ఎస్ ఎంపీలు మద్దతు పలికింది వాస్తవం కాదా అని అన్నారు. పదేళ్లలో జరిగిన అవినీతిపై కాంగ్రెస్ ప్రభుత్వం కమిషన్ వేయగానే కేసీఆర్, కేటీఆర్ ప్రధాని నరేంద్రమోదీ శరణు కోరుతున్నారని, అవినీతితో కోట్లు దోచుకున్న కేసీఆర్, కేటీఆర్‌పై చర్యలు తప్పవన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీ పథకాలు విజయవంతంగా అమలవుతున్నాయని, ఎన్నికల ముందు కాంగ్రెస్ ఇచ్చిన వాగ్ధానాలను ప్రజలకు నెరవేర్చడమే లక్ష్యంగా పెట్టుకున్నట్టు ఆయన చెప్పారు. సమావేశంలో మేయర్ బంగి అనిల్‌కుమార్, నాయకులు దీటి బాలరాజు, ఎండీ ముస్తాఫా, తిప్పారపు శ్రీనివాస్, పాతిపెల్లి ఎల్లయ్య, గట్ల రమేష్, కళ్యాణి సింహాచలం, గుంపుల తిరుపతి పాల్గొన్నారు.

ఎస్‌జీఎఫ్ సెపక్ తక్రా రాష్ట్ర చాంపియన్స్‌గా ఉమ్మడి జిల్లా

- ఫైనల్స్‌లో రంగారెడ్డిపై గెలుపొందిన బాలబాలికల జట్లు


రాష్ట్ర చాంపియన్స్‌గా నిలిచిన ఉమ్మడి జిల్లా బాలబాలికల జట్లు

కరీంనగర్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి పాఠశాల క్రీడా సమాఖ్య అండర్-17 సెపక్‌తక్రా రాష్ట్ర చాంపియన్లుగా ఉమ్మడి కరీనగర్ జిల్లా బాలబాలికల జట్లు నిలిచాయి. మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురులో ఈ నెల 16, 17, 18 తేదీల్లో జరిగిన అండర్-17 ఎస్‌జీఎఫ్ సెపక్ తక్రా రాష్ట్రస్థాయి పోటీల్లో ఉమ్మడి జిల్లా జట్లు విశేష ప్రతిభ చాటాయి. సోమవారం జరిగిన ఫైనల్స్‌లో ఉమ్మడి కరీంనగర్ జిల్లా జట్లు బాలబాలికల విభాగంలో రంగారెడ్డి జట్లపై గెలుపొంది టోర్నమెంట్ చాంపియన్స్‌గా నిలిచాయి. బాలుర జట్టు నుంచి ఆర్ మోహన్ అఖిరా నందన్, సాయి వర్ధన్, శ్రీరామ్, రెహమాన్‌లు పాల్గొని విజేతలుగా నిలవగా, బాలికల జట్టు నుంచి పూజ, అక్షయ, కవిత, హన్సిక, నక్షత్రాలు పాల్గొని విజేతలుగా నిలిచి చాంపియన్‌షిప్ సాధించాయి. రాష్ట్ర చాంపియన్లుగా నిలిచిన బాలబాలికల జట్లకు కోచ్‌లుగా జి కుమార్, మేనేజర్‌గా శివకృష్ణలు వ్యవహరించారు. రాష్ట్ర చాంపియన్లుగా నిలిచిన జట్లను జిల్లా విద్యాశాఖ అధికారి సీహెచ్‌వి జానర్ధన్‌రావు, జిల్లా యువజన క్రడాశాఖ అధికారి బి శ్రీనివాస్‌గౌడ్, జిల్లా ఎస్‌జీఎఫ్ ప్రధాన కార్యదర్శి బి వేణుగోపాల్, సెపక్‌తక్రా అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి విజయభాస్కర్‌రెడ్డి అభినందించారు.

జాతీయస్థాయి హాకీ పోటీలకు చెల్పూర్ విద్యార్థి ఎంపిక


సూత్రాల హర్షిత్

హుజూరాబాద్‌రూరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెల్పూర్ జడ్పీహెచ్ఎస్‌లో పదో తరగతి చదువుతున్న సూత్రాల హర్షిత్ అనే విద్యార్థి జాతీయ స్థాయి హాకీ పోటీకలు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అనురాధ, పీడీ శ్రీనివాస్‌లు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. హర్యానాలో ఈ నెల 22 నుంచి 27 వరకు జరగనున్న హాకీ పోటీల్లో హర్షిత్ రాష్ట్రం తరపున ఆడతాడని తెలిపారు.


కోటిలింగాల వద్ద గోదావరి హారతి ఇస్తున్న అర్చకులు

కోటిలింగాలలో వైభవంగా గోదావరి హారతి

వెల్గటూర్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం మూడవ సోమవారం సందర్భంగా కోటిలింగాలలో గోదావరి హారతి కార్యక్రమాన్ని అర్చకులు వైభవంగా నిర్వహించారు. అంతకు ముందు అర్చకులు నాగరాజు శర్మ, సంజీవ్ శర్మలు శ్రీ పార్వతి కోటేశ్వర స్వామి ఆలయంలో స్వామి వారికి పంచామృత అభిషేకాలు వంటి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివనామ స్మరణతో ఆలయ ప్రాంగణం మారుమోగింది. అర్చకుల వేద మంత్రోచ్చారణల మధ్య, భక్తుల జయ జయ ధ్వానాల మధ్య గోదావరి మాతకు పూజలు చేసి గోదావరికి హారతినిచ్చారు. భక్త లు అధిక సంఖ్యలో పాల్గొని గోదావరి హారతి కార్యక్రమాన్ని తిలకించారు. ఆలయ ఈవో కాంతా రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు. పులకరించి పోయారు.

బైక్ అదుపు తప్పి వృద్ధుడి మృతి

కథలాపూర్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని దూలూరుకు చెందిన జూపాక పోచయ్య (62) అనే వృద్ధుడు బైక్ అదుపు తప్పి మృతి చెందాడు. ఎస్సై నవీన్ కథనం ప్రకారం... పోచయ్య ఆదివారం భూషణరావుపేట మర్రవ్వ దేవాలయం వద్ద ఓ శుభకార్యానికి హాజరై సాయంత్రం బైక్‌పై స్వగ్రామం బయలు దేరాడు. భూషణరావుపేట శివారులోని శ్మశాన వాటిక మూల మలుపు వద్ద బైక్ అదుపు తప్పి పక్కన ఉన్న గోతిలోకి దొప్పుకు వెళ్లింది. ఆ క్రమంలో అక్కడ ఉన్న చెట్టు రెమ్మలు తలకు తాకడంతో గాయాలయ్యాయి. రాత్రి దాకా అచూకీ లభించకపోవడంతో కుటుంబ సభ్యులు రోడ్డు వెంట వెతికారు. కింద పడి అపస్మారకస్థితిలో కనిపించడంతో ఆసుపత్రికి తరలించే లోపే మార్గమధ్యలో మృతి చెందాడు. పోచయ్యకు భార్య, ముగ్గురు కుమారులు ఉన్నారు. కుమారుడు కిరణ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు శవాన్ని కోరుట్ల ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం పంపి కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

ధర్మపురి క్షేత్రంలో కార్తీక సందడి


ధర్మపురి వద్ద గోదావరి హారతి

ధర్మపురి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలో మూడవ సోమవారం కార్తీక సందడి నెలకొంది. స్థానిక లక్ష్మీ నృసింహస్వామి, అనుబంధ రామలింగేశ్వ స్వామి, అక్కపెల్లి రాజరాజేశ్వర స్వామి ఆలయంలో భక్తుల రద్దీ పెరిగింది. గోదావరి నదిలో భక్తులు కార్తీక స్నానాలు ఆచరించారు. వేద పండితులు బొజ్జ రమేష్ శర్మ, వేద పారాయణదారు పాలెపు ప్రవీణ్ కుమార్‌శర్మ స్వామి వారల ప్రత్యేకపూజలు జరిపించారు. భక్తులకు ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో సిబ్బంది తగు సేవలు అందించారు.

●కార్తీక మాసం పురస్కరించుకుని ధర్మపురి వద్ద గోదావరి హారతి 17వ రోజు సోమవారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. ఆలయ వేదపండితులు, అర్చకులు, సిబ్బంది గోదావరి మాతకు ప్రత్యేక పూజలు నిర్వహించి హారతి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు పాల్గొన్నారు.

నరసింహుడి సన్నిధిలో ప్రముఖుల పూజలు


హైకోర్టు రిజిస్ట్రార్ ఎంపీ రమేష్ దంపతులకు స్వామివారి చిత్రపటం అందజేస్తున్న ఆలయ ఈవో

ధర్మపురి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి లక్ష్మీనర సింహ స్వామి దేవాలయాన్ని రాష్ట్ర హైకోర్టు రిజిస్ట్రార్ ఎంపీ రమేష్ దంపతులు, జిల్లా అడిషనల్ జడ్జి నారాయణ వేర్వేరుగా సోమవారం సందర్శించారు. ఆలయం వద్ద వారిద్దరకి వేర్వేరుగా వేద పండితులు, అర్చకులు మర్యాద పూర్వకంగా స్వాగతం పలికారు. అనంతరం వారు స్వామి సన్నిధిలో పూజలు నిర్వహించారు. ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ వారికి స్వామి శేష వస్త్రం, ప్రసాదాలు, చిత్రపటాలు అందించి సత్కరించారు.

రాజన్న క్షేత్రం.. భక్తజన సంద్రం


భక్తులతో కిటకిటలాడుతున్న రాజన్న ఆలయ ప్రాంగణం

వేములవాడ కల్చరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): కార్తీక సోమవారం సందర్భంగా రాజన్న సిరిసిల్ల జిల్లాలోని వేములవాడ రాజరాజేశ్వరస్వామి క్షేత్రం భక్తజన సంద్రంగా మారింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌తోపాటు ఇతర రాష్ట్రాలనుంచి భక్తులు తరలివచ్చారు. అనంతరం పార్వతి పరమేశ్వరులను దర్శించుకున్నారు. రాజన్నకు ప్రీతిపాత్రమైన కోడెమొక్కు చెల్లించుకున్నారు. కోడె మొక్కు చెల్లింపునకు సుమారుగా నాలుగు గంటలపాటు క్యూలైన్‌లో నిరీక్షించారు. కార్తీక మాసం మూడో సోమవారం సందర్భంగా ఆలయం ముందు భాగంలోని చెట్టు వద్ద మహిళలు కార్తీక దీపాలను వెలిగించారు. ఈవో వినోద్ రెడ్డి ఆధ్వర్యంలో అధికారులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

సామూహిక కార్తీక దీపోత్సవం

కార్తీక మాసం సందర్భంగా రాజన్న ఆలయంలో నిర్వహిస్తున్న సామూహిక కార్తీక దీపోత్సవం కొనసాగుతోంది. సోమవారం పట్టణానికి చెందిన మహిళలు పలు ఆకృతుల్లో దీపాలను వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు.

రాజన్న ఆలయంలో మహాలింగార్చన

వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయం లో అర్చకులు మహాలింగార్చన కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. స్వామివారికి ఉదయం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మహాన్యాస పూర్వక ఏకదశ రుద్రాభిషేకం చేపట్టారు. సాయంత్రం ఆలయ కల్యాణ మండపంలో అర్చకుల వేదమంత్రాల మధ్య పిండితో తయారు చేసిన దీపాలను లింగాకృతిలో వెలిగించారు.

● వేములవాడ రాజరాజేశ్వరస్వామిని ఐఏఎస్ అధికారి కృష్ణభాస్కర్ సోమవారం రాజన్నను దర్శించుకున్నారు. రాజన్న ఆలయానికి వచ్చిన ఆయనకు ఆలయాధికారులు, అర్చకులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కోడెమొక్కు చెల్లించుకున్నారు. ఆలయ అర్చకులు ఆశీర్వచనం, ఆలయ ఈవో వినోద్ రెడ్డి సామి ప్రసాదాన్ని అందజేశారు.



రాజన్న దర్శనం కోసం క్యూలైన్‌లో బారులు తీరిన భక్తులు, కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తులు

హామీల అమలుపై రాజన్న సాక్షిగా ప్రకటన చేయాలి


మాట్లాడుతున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆగయ్య

సిరిసిల్ల రూరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా రాజన్న సిరిసిల్ల జిల్లాలో కాంగ్రెస్ నాయకులు ఇచ్చిన హామీలను అమలు చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి రాజన్న సాక్షిగా ప్రకటించాలని, సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలలో నెలకొన్న సమ స్యలను పరిష్కరించాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య డిమాండ్ చేశారు. సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని తెలంగాణ భవన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నేతన్నలకు ఉపాధిని కల్పించడంతోపాటు ఆత్మహత్య చేసుకున్న నేతన్నల కుటుంబాలను ఆదుకోవాలన్నారు. రాష్ట్రంలో ఎన్నికలు ముగిసి 11 నెలలు గుడుస్తున్నాయని, సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గాల్లో ప్రచారంలో ఇచ్చిన హామీ లను విస్మరించారని అన్నారు. మిడ్‌మానేరు నిర్వాసితులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. 11 నెలలుగా వస్త్ర పరిశ్రమ సంక్షోభంలో కూరుపోయిందని, రాష్ట్ర ప్రభుత్వం ఆర్డర్లు ఇవ్వకపోవడంతో నేతన్నలకు ఉపాధి లేకుండా పోయిందని అన్నారు. సరైన ఉపాధిలేక కుటుంబాలను పోషించుకునే పరిస్థితి లేక పోవడంతో ఇప్పటివరకు దాదాపు 20 మంది నేతన్నలు ఆత్మహత్య చేసుకున్నారని, దీనికి సీఎం బాధ్యత వహించాలని అన్నా రు. 3 నెలల క్రితం ప్రకటించిన చీరల తయారీ ఆర్డర్లను వెంటనే అందించాలన్నారు. ఆత్మహత్య చేసుకున్న నేతన్నల కుటుంబాలను ఆర్థికంగా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి గుడూరి ప్రవీణ్, పట్టణ ప్రధాన కార్యదర్శి మ్యాన రవి, సెస్ డైరెక్టర్ దార్నం లక్ష్మీనారాయణ, నాయకుల బొల్లి రాంమోహన్, ఎండీ సత్తార్, అగ్గిరాములు, గుండ్లపల్లి పూర్ణచందర్, కంచర్ల రవిగౌడ్, సబ్బని హరీష్, కుంబాల మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మత్స్య కార్మికులను ముంచిన కాంగ్రెస్ ప్రభుత్వం

గంభీరావుపేట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) మత్స్య కార్మికులను కాంగ్రెస్ ప్రభుత్వం నట్టేట ముంచిందని మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సుతారి బాలవ్వ ఆరోపించారు. గంభీరావుపేట మండల కేంద్రంలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. జూలై, ఆగస్టులోనే ఉచిత చేప పిల్లలను ప్రభుత్వం పంపిణీ చేయాల్సి ఉందని, నవంబరులో పంపిణీ చేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 2016 నుంచి 2023 వరకు రాష్ట్ర వ్యాప్తంగా ఆగస్టు నెలలోనే చేప పిల్లలను పంపిణీ చేసిన విషయాన్ని గుర్తు చేశారు. జిల్లా వ్యాప్తంగా అప్పర్ మానేరు, అన్నపూర్ణ రిజర్వాయర్, మిడ్ మానేరుతోపాటు 440 చెరువులు ఉండగా, బీఆర్ఎస్ ప్రభుత్వం 1 కోటి 40 లక్షల చేప పిల్లలను పంపిణీ చేసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం జిల్లాకు కేవలం 75 లక్షల చేప పిల్లలను మాత్రమే పంపిణీ చేసిందన్నారు. జిల్లాలో 10వేల మందికి పైగా మత్స్య కార్మికులు వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నారన్నారు. చేపపిల్లలతోపాటు రొయ్య పిల్లలను కూడ పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు.

స్నేహితుడికి ఆర్థిక సహాయం

వీర్నపల్లి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): వీర్నపల్లి మండల కేంద్రానికి చెందిన చిన్ననాటి స్నేహితుడు అనారోగ్యంతో బాధపడుతుండగా విషయం తెలుసుకున్న తోటి మిత్రుడే ఎన్ఆర్ఐ రాధారపు సత్యం రూ.15 వేల ఆర్థిక సహాయాన్ని సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాటాడుతూ ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడానికి తనవంతు సహాయ సహకారాలు అందిస్తున్నట్లు తెలిపారు. ఆయన వెంట స్నేహితులు లోకుర్తి తిరుపతి, శేఖర్ తదితరులు ఉన్నారు.

మహిళా శక్తి వారోత్సవాలు

జగిత్యాలరూరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల మండల సెర్ప్ కార్యాలయంలో మహిళ శక్తి వారోత్సవాలను సోమవారం ఘనంగా నిర్వహించారు. అనంతరం మహిళ సంఘాలకు ప్రభుత్వం ద్వారా అందజేస్తున్న బ్యాంక్ లింకేజీ, రుణ బీమా, ప్రమాదబీమా, వడ్డీలేనిరుణాలు, అమ్మ ఆదర్శ పాఠశాలక మిటీలు, చిన్నతరహా పరిశ్రమల ఏర్పాటుపై సమీక్ష నిర్వహించారు.

రాజన్న ఆలయ అభివృద్ధికి శ్రీకారం

3వ పేజీ తరువాయి

వేములవాడ దేవస్థానానికి సంబంధించిన అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. దేవస్థానం విమాన గోపురానికి రూ.6 కోట్ల నిధులతో 16 కిలోల బంగారంతో బంగారు తాపడం చేపట్టాలని నిర్ణయించారు. ఆలయ ప్రాంగణంలో ఆధ్యాత్మిక వాతావరణాన్ని పెంపొందించే దిశగా పలు కార్యక్రమాలపై మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, విప్ ఆది శ్రీనివాస్ ఇటీవల సమీక్ష కూడా నిర్వహించారు. ఈ దిశగానే సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన ప్రాధాన్యం సంతరించుకుంది.



వేములవాడ రాజన్న ఆలయం

గత ప్రభుత్వంలో నామమాత్రపు పనులు

వేములవాడ రాజరాజేశ్వరస్వామి దేవస్థానం అభివృద్ధిపై గత ప్రభుత్వం నామమాత్రపు పనులతో సరిపెట్టిందనే విమర్శలు ఉన్నాయి.

రాష్ట్రంలోనే అతిపెద్ద శైవక్షేత్రంగా ఉన్న రాజన్న దేవస్థానం విస్తరణ అభివృద్ధి పనుల కోసం ఏటా రూ.100 కోట్లు కేటాయిస్తానని 2015లో అప్పటి ముఖ్య మంత్రి కేసీఆర్ హామీ ఇచ్చారు. ఇందుకు అనుగుణంగా 2016లో వేములవాడ టెంపుల్ డెవలప్‌మెంట్ అథారిటీని నియమించారు.

వీటీడీఏ రూ. 410 కోట్ల అంచనాలతో 13 పనులకు ప్రతి పాదనలు రూపొందించి పంపించారు. దాదాపు ఏడున్నర సంవత్సరాలుగా నామమాత్రంగానే పనులు చేశారని చెప్పుకోవచ్చు. గుడి చెరువును 35 ఎకరాలు పూడ్చి ఆలయ విస్తరణ కోసం ఏర్పాట్లు చేశారు. చెరువును సైతం మరోవైపు విస్త రించడానికి భూయజమానులకు రూ.30 కోట్లు చెల్లిం చారు. వీటీడీఏ ద్వారా రూ.77.90 కోట్లు ఖర్చు చేశారు. బద్దిపోచమ్మ ఆలయ విస్తరణ కోసం చుట్టు పక్క ఇళ్ల యజమానులకు రూ.20 కోట్లు ఖర్చు చేశారు. వీటీడీఏ రాజన్న ఆలయ డిపాజిట్లపై నుంచి అప్పు తీసుకున్నారు.

ట్యాంక్‌బండ్ నిర్మాణం, రిటెయినింగ్ వాల్ నిర్మాణం, మిషన్ కాకతీయ ద్వారా ఖర్చు చేశారు. వీటీడీఏ ద్వారా ఇప్పటి వరకు జరిగిన ఖర్చులు, అభివృద్ధి లెక్కలపై కూడా స్పష్టత లేకపోవడం గమనార్హం. ప్రస్తుతం కొత్త ప్రభుత్వం పకడ్బందీగా పనులు పూర్తి చేస్తుందని భక్తులు అభిప్రాయపడుతున్నారు.

పెరిగిన చలి

(3వ పేజీ తరువాయి)

వేడినీటితో స్నానం చేయించాలి. ప్రయాణాలు తగ్గించుకోవడం మంచిది. ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి. పిల్లలకు ఇచ్చే ఆహారంలో ఆకుకూరలు ఎక్కువగా ఉండాలి. సీతాఫలాలు, ఐస్‌క్రీమ్‌లు, చాక్‌లేట్లు తినిపించవద్దు. జలుబు, జ్వరం వస్తే డాక్టర్లను సంప్రదించాలి.

చర్మ సమస్యలు

చలి కాలంలో చర్మ సమస్యలు బాధిస్తాయి. మాయిశ్చరైజర్లు. క్రీమ్‌బేస్డ్ మాయిశ్చరైజర్లను ఉపయోగించడం మంచిది. చలికాలంలో వేధించే మరో సమస్య పెదాలు పగిలి రక్తం కారడం. అందుకే పెదాలకు వ్యాజిలిన్, లిప్‌బామ్ వంటివి రాసుకోవాలి. పాదాలు పగలడం ఎక్కువగా ఉంటుంది. ఉప్పు నీరు కలిపిన గోరువెచ్చని నీటిలో పాదాలను పది నిమిషాలు ఉంచాలి. ప్రతి రోజు పడుకునే ముందు ఇలా చేయాలి. నీటిలో ఉంచిన తరువాత సబ్బుతో శుభ్రంగా కడుక్కుని పొడి గుడ్డతో శుభ్రంగా తుడవాలి. పగిలిన చోట మాయిశ్చరైజర్ రాయాలి. విటమిన్- ఇ క్రీమ్ రాస్తే మంచిది. చర్మం తెల్లగా పొడి బారకుండా ఉండడానికి గ్లిజరిన్ సోప్ వాడాలి. స్నానం సోప్ కూడా ఆయిల్ బేస్డ్‌తో ఉన్నది మంచిది. అప్పుడే చర్మం మృదువుగా ఉంటుంది. సబ్బుతో చర్మాన్ని ఎక్కువ సేపు రుద్దకుండా ఉండాలి. స్నానా నికి ముందు ఆలీవ్ ఆయిల్, కొబ్బరినూనెతో మసాజ్ చేసుకుని తలస్నానం చేయాలి. చలికాలం అనగానే బాగా వేడి నీటితో స్నానం చేస్తే చలిపోతుందని అనుకుంటారు. కానీ అలా చేయడం వల్ల చర్మం పొడిబారుతుంది. గోరువెచ్చని నీటితోనే స్నానం చేయాలి. ఊలు దుస్తులు ధరించాలి.

చలిమంటలు.. జాగ్రత్తలు

చలికాలం అనగానే తెల్లవారుజామునే ఆరుబయట మంటలు వేసుకోవడం అలవాటు. మంటలు వేసుకునే సమయంలో చిన్నారులను దగ్గరకు వెళ్లకుండా చూసుకోవాలి. మహిళలు చీర కొంగులను జాగ్రత్తగా గమనించాలి. మంట వద్ద పరాచకాలు ఆడడం కూడా ప్రమాదానికి దారితీస్తుంది.

సీఎం రాక చరిత్రాత్మక ఘట్టం

వేములవాడ కల్చరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయానికి రావడం ఒక చరిత్రాత్మకమైన ఘట్టమని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. ఈ నెల 20న సీఎం రేవంత్‌రెడ్డి పర్యటనలో భాగంగా సభాస్థలిని స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రభుత్వ విప్ మాట్లాడుతూ గత సీఎం కేసీఆర్ ఆలయాన్ని అభివృద్ధి చేస్తానని చెప్పి ఒక్క కొత్త ఇటుక కూడా పెట్టలేదని విమర్శించారు. అదే రోజు ఇదే వేదిక నుంచి ముంపు గ్రామాల ప్రజలకు న్యాయం చేస్తానని, డబుల్ బెడ్‌రూం ఇళ్లు కట్టిస్తామని హామిచ్చి మరిచిపోయారని అన్నారు. టీపీసీసీ అధ్యక్షుడి హోదాలో రేవంత్‌రెడ్డి ముంపు గ్రామాల్లో పర్యటించిన సమయంలో తాము అధికారంలోకి వచ్చిన వెంటనే ముంపు గ్రామాల సమస్యలతో పాటుగా రాజన్న ఆలయాభివృద్ధి ఒక్కోక్కటిగ పరిష్కరించుకుంటూ ముందుకు వెళుతామని హామిచ్చారు. ఇచ్చిన హామీమేరకు ముంపు గ్రామాల సమస్యలతో పాటు ఆలయాభివృద్ధి పనులు ఒక్కోక్కటిగా చేస్తున్నామని అన్నారు. గుడి చెరువు, మూలవాగులో మురికి నీరు చేరకుండా చేస్తామని ఆనాడే చెప్పామని, దానికి సంబందించి కెనాల్ నిర్మాణానికి సోమవారం రూ.3.8 కోట్లు మంజూర య్యాయన్నారు.



విలేకర్లతో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

ఏర్పాట్లు పరిశీలించిన కలెక్టర్..

వేములవాడలో బుధవారం సీఎం రేవంత్‌రెడ్డి పర్యటనలో భాగంగా ఏర్పాట్లు చేస్తున్న పనులను జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, ఎస్పీ అఖిల్‌మహాజన్‌లు పరిశీలించారు. ఆలయ పరిసరాలతోపాటుగా గుడి చెరువులోని సభస్థలిని పరిశీలించి సంబందిత అధికారులకు పలు సూచనలు చేశారు.

సీఎం సభను విజయవంతం చేయండి

చందుర్తి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): వేములవాడ పట్టణంలో ఈనెల 20 జరిగే సీఎం రేవంత్ రెడ్డి బహిరంగ సభను విజయవంతం చేయాలని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చింతపంటి రామస్వామి అన్నారు. చందుర్తిలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సీఎం బహిరంగ సభకు చందుర్తి మండలం నుంచి అధిక సంఖ్యలో రైతులు, మహిళలు, యువకులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి సభను విజయవంతం చేయాలన్నారు. రేవంత్‌రెడ్డి వేములవాడ రాజ రాజేశ్వర స్వామి ఆలయ అభివృద్ధి, పట్టణ అభివృద్ధి కోసం నిధులు మంజూరు చేయ డంతో పాటు ముంపు గ్రామాలను ఆదుకునేందుకు ప్రత్యేక కార్యచరణ సిద్ధం చేశారన్నారు. ఈ సమావేశంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి టొట్టె ప్రభాకర్ పాల్గొన్నారు.

అనుమతులు లేకుండా ఇసుక తరలించవద్దు

ఇల్లంతకుంట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): అనుమతులు లేకుండా ఇసుకను తరలించవద్దని తహసీల్దార్ ఫారూఖ్, ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ సూచించారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో ఇసుక ట్రాక్టర్ల యజమానులకు అవగాహన కల్పించారు. కేటాయించిన రీచ్ నుంచి మాత్రమే ఇసుకను తీసుకోవాలని, అనుమతి తీసుకున్న ప్రదేశానికి మాత్రమే ఇసుకను తరలించాలని అన్నారు. ట్రాక్టర్ అధిక వేగంతో వెళ్లినా, డ్రైవింగ్ లైసెన్స్ లేని వారు వాహనాలు నడిపినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో ఆర్ఐ షఫీ, వీఆర్వో సింగారెడ్డి పాల్గొన్నారు.

నాణ్యతాప్రమాణాలు పాటించాలి

జగిత్యాలరూరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): కొనుగోలు కేంద్రాల్లో నాణ్యత ప్రమాణాలను పాటించాలని జగిత్యాల జిల్లా అడిషనల్ కలెక్టర్ బి. లత అన్నారు. సోమవారం జగిత్యాల మండలంలోని ధరూర్, అంబారిపేట, రూరల్ మండలంలోని ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని అడిషనల్ కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దళారులకు రైతులు ధాన్యాన్ని విక్రయించవద్దని, ప్రభుత్వం ద్వారా ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి మద్దతు ధర పొందాలని సూచించారు. సివిల్ సప్లై అధికారి వరప్రసాద్, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, ఏపీఎం ఓదెల గంగాధర్, సీసీలు విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుపై అవగాహన

రాయికల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆలూరు గ్రామంలో ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో రైతులకు సోమవారం ఆయిల్ పామ్ పంట సాగుపై అవగాహన కల్పించారు. జగిత్యాల నియోజకవర్గ ఉద్యాన శాఖ అధికారి కందుకూరి స్వాతి మాట్లాడుతూ ఆ యిల్ పామ్ పంటకు కోతుల బెడద, ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టం ఉండదని, ఖచ్చిత మైన మార్కెటింగ్ వ్యవస్థ ఉందని, ప్రస్తుతం ఒక టన్ను ధర రూ.19 వేలు ఉందన్నారు. ప్రభుత్వం మొక్కలను, డ్రిప్ పరికరాలను 90 శాతం సబ్సిడీపై అందజేస్తుందన్నారు. మొ క్క నాటిన మూడేళ్ల తర్వాత కోత మొదలై 30 ఏళ్ల వరకు ప్రతి నెల దిగుబడి ఇస్తుందని తెలిపారు. మూడేళ్ల వరకు అన్ని రకాల పంటలను అంతర పంటలుగా వేసుకోవచ్చునని, దీనికిగాను నిర్వహణ నిమిత్తం ఒక ఎకరానికి ఒక సంవత్సరానికి రూ. 4200 చొప్పున నా లుగేళ్ల వరకు రూ.16,800 రైతులకు అందజేస్తామని పేర్కొన్నారు.

పోలీస్ అధికారులను సన్మానించిన ఎమ్మెల్యే

కొడిమ్యాల, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాచుపల్లి జేఎన్‌టీయు ప్రధా న రోడ్డు పక్కన ప్రమాదకరంగా ఉన్న వ్యవసాయ బావిని పూడ్చివేయుటకు దగ్గర ఉండి పనులను పర్యవేక్షించిన పోలీస్ అధికారులు మల్యాల సీఐ నీలం రవి, కొడిమ్యాల ఎస్సై సౌదం సందీప్, మల్యాల ఎస్సై నరేష్, సహకరించిన బావి యజమాని బొజ్జ లచ్చంను సోమవారం చొప్పదండి ఎమ్మెల్యే డా.. మేడిపల్లి సత్యం శాలువా కప్పి సన్మానించారు. అ నంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ బావి యజమానికి బోరు వేసేందుకు హామీ ఇస్తున్నట్లు ప్రకటించారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నారాయణగౌడ్, మ ల్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు జీవన్‌రెడ్డి, నాయకులు ముత్యం శంకర్, సాయికుమార్, అంజాగౌడ్, తిర్మలేష్, శంకర్‌గౌడ్, అజయ్‌గౌడ్, లింగయ్య, రాజు, రమేష్, విక్రం ఉన్నారు.

ప్రజావాణి సమస్యలు సత్వరమే పరిష్కరించాలి

కలెక్టర్ సత్య ప్రసాద్

జగిత్యాల, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణి సమస్యలను సంబంధిత శాఖ అధికారులు సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ సత్య ప్రసాద్ అధికారుల ను ఆదేశించారు. సోమవారం పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమానికి కలెక్టర్ హాజరై జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. వివిధ సమస్యలపై ప్రజల నుంచి 41 దరఖాస్తులను స్వీకరించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడా రు. వివిధ ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులు ఆన్‌లైన్‌లోని తమ తమ లాగిన్‌లో గల ప్రజావాణి దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరించి నివేదిక అందించాల న్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ బీఎస్ లత, స్థానిక సంస్థల ఇన్ చార్జి అదనపు కలెక్టర్ గౌతమ్‌రెడ్డి, జగిత్యాల, మెట్‌పల్లి, కోరుట్ల ఆర్‌డీవోలు మధుసూదన్, శ్రీనివాస్, జివాకర్ రెడ్డి, కలెక్టరేట్ ఏవో హన్మంతరావు, డీఆర్‌డీవో ర ఘువరన్‌లతో పాటు వివిధ ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఆటల పోటీలు

జగిత్యాల అర్బన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 21వ తేదీన అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవా న్ని పురస్కరించుకుని జగిత్యాల పట్టణంలోని వివేకానంద మినీ స్టేడియంలో దిగువ తెలిపిన ఆటల పోటీలను నిర్వహించనున్నట్లు జిల్లా సంక్షేమ అధికారి నరేష్ తెలిపారు. పరుగు పందెం, షాట్‌పుట్, చెస్, శారీరక వికలాంగులకు మూడు చక్రాల సైకిల్‌తో పరుగు పందెం, షార్ట్‌పుట్, క్యారం బోర్డు, మానసిక వికలాంగుల కు పరుగు పందెం, షాట్‌పుట్, క్యారం బోర్డు 18-54 సంవత్సరాల్లోపు వయస్సు గలవారికి పరుగు పందెం, షార్ట్‌పుట్, క్యారం బోర్డు పోటీలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల దివ్యాంగులు ఉదయం 9 గంట లకు వివేకానంద మినీ స్టేడియానికి హాజరై ఆటల పోటీల్లో పాల్గొనాలని కోరారు.

ఎమ్మెల్యే పరామర్శ

జగిత్యాల అర్బన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల పట్టణంలోని పదవ వార్డుకు చెందిన రిటైర్డ్ టీచర్ వీరబత్తిని లక్ష్మయ్య మరణించగా బాధిత కుటుంబాన్ని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ సోమవారం రాత్రి పరామర్శించారు. పట్టణంలోని పదిహేడో వార్డుకు చెందిన చిట్నేని కరుణాకర్ రావు అనారోగ్యంతో మరణించగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట కౌన్సిలర్ కూతురు రాజేష్, పిఆర్‌టియు జిల్లా అధ్యక్షులు ఆనందరావు, వేణుగోపాల్ రావు, అశోక్‌రావు, పుత్తయ్య, దయానంద్, రాజు, ప్రదీప్ ఉన్నారు.

ట్రాఫిక్ సమస్యకు మోక్షం

- సిగ్నల్ లైట్స్, స్పీడ్‌గన్, కెమెరాలు
- 3 ప్లస్ 9 ట్రాఫిక్ పోలీసుల కేటాయింపు
- సిరిసిల్లలో ట్రాఫిక్ ఆంక్షలు అమలు



నేతన్న చౌక్‌లో ఏర్పాటు చేసిన ట్రాఫిక్ సిగ్నల్స్

సిరిసిల్ల క్రైం, నవంబరు 18: జిల్లా కేంద్రమైన సిరిసిల్ల పట్టణంలో ట్రాఫిక్ సమస్యకు ఎట్టకేలకు మోక్షం లభించింది. జిల్లా ఏర్పాటు తర్వాత సిరిసిల్లలో వాహనాల రాకపోకలు పెరిగి ట్రాఫిక్ సమస్య తీవ్రమైంది. దీంతో కొంత కాలంగా ట్రాఫిక్ ఇబ్బందులు తీవ్రం కావడంతో పోలీసుశాఖ చర్యలు చేపట్టింది. సిరిసిల్ల పట్టణంలోని నేతన్న చౌక్, అంబేద్కర్‌చౌక్, గాంధీచౌక్, కొత్త బస్టాండ్, పాత బస్టాండ్, తదితర ప్రాంతాలలో ట్రాఫిక్ ఇబ్బందులు నెలకొన్నందున ఈ ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి పెట్టారు.

ట్రాఫిక్ అంక్షలు

జిల్లా కేంద్రమైన సిరిసిల్ల పట్టణంలో ట్రాఫిక్ అంక్షలు ముమ్మరం చేశారు. పట్టణంలోని అంబేద్కర్‌చౌక్, నేతన్న చౌక్, గాంధీచౌక్‌లో ట్రాఫిక్ అమలులోకి తీసుకువచ్చారు. నేతన్న చౌక్ వద్ద 4 ట్రాఫిక్ లైట్లు బిగించారు. ఈ ట్రాఫిక్ సిగ్నల్స్ ఆధారంగానే వాహనాల రాకపోకలకు సులభమైంది. అంతకుముందు ఎవరి వాహనాలను వారు ఇష్టానుసారంగా నడపడంతో తరుచూ ప్రమాదాలు చోటుచేసుకునేవి. ప్రమాదాలు తగ్గాయి.

అతివేగంపై క్లిక్

సిరిసిల్లలో అతివేగంపై కళ్లెం వేసేందుకు చర్యలు చేపట్టారు. సిరిసిల్ల పట్టణంలో 40కి.మీ వేగం కంటే ఎక్కువగా వెళ్లే వాహనాలపై నిఘా పెట్టారు. ఇందుకోసం పట్టణంలోని పాత బస్టాండ్, కొత్త బస్టాండ్, రగుడు చౌరస్తా, ఎల్లమ్మ చౌరస్తా, గాంధీచౌక్, అంబేద్కర్‌చౌరస్తా, నేతన్న చౌక్ తదితర ప్రాంతాలలో 18 ఇంటిగ్రేటెడ్ కెమెరాలు బిగించారు. వాహనదారులు హెల్మెట్, అతివేగం, సిగ్నల్స్ అతిక్రమణ, సీట్ బెల్ట్, నో పార్కింగ్ తదితర ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమించి నడిపితే కెమెరాలు క్లిక్‌మంటాయి. ఇవే కాకుండా స్పీడ్‌గన్‌ను ఏర్పాటు చేశారు. ఈ స్పీడ్‌గన్ బైపాస్‌రోడ్డులు, ప్రధాన రహదారులపై వాహనదారులు 60కి.మీ వేగం కంటే ఎక్కువగా వెలితే క్లిక్ మంటుంది. ఇనుంచి ట్రాఫిక్ రూల్స్ అతిక్రమిస్తే ఫైన్ పడి నేరుగా మొబైల్‌కే మెస్సెజ్ వస్తుంది.

ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ పోలీస్

సిరిసిల్ల పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణలో భాగంగా ప్రధాన కూడళ్ల వద్ద ట్రాఫిక్ పోలీసు 24గంటలు నిఘా ఉంటుంది. ఇందుకు ఒక ఎస్ఐ, ఇద్దరు కానిస్టేబుల్స్, 9 మంది హోంగార్డులు డ్రెస్‌కోడ్‌తో ట్రాఫిక్‌కు అంతరాయం కలుగకుండా చర్యలు తీసుకుంటున్నారు. దీంతో వాహనదారులకు ట్రాఫిక్ సమస్య తీరింది.

వేగ నియంత్రణకు చర్యలు

– అఖిల్ మహాజన్, ఎస్పీ



వాహనాల వేగనియంత్రణకు చర్యలు చేపట్టాం. సిరిసిల్లలో ట్రాఫిక్ సమస్య లేకుండా చూస్తాం. ప్రధాన కూడళ్ల వద్ద నిఘా పెట్టాం. ఏ వాహనదారుడైనా ట్రాఫిక్ నియంత్రణ అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటాం. వాహనదారులు హెల్మెట్, సీట్ బెల్ట్, డ్రంక్ అండ్ డ్రైవ్ నిబంధనలు తప్పకుండా పాటించాలి.

సమగ్ర కుటుంబ సర్వేపై అపోహలు వద్దు



సమగ్ర కుటుంబ సర్వేను పరిశీలిస్తున్న జీవన్ రెడ్డి

రాయికల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వేపై ప్రజలు అపోహలు పడవద్దని ఎమ్మె ల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. ప్రజలు సర్వేకు వారి వివరాలను క్షుణ్ణంగా చె ప్పాలని అన్నారు. మండలంలోని అల్లీపూర్ గ్రామంలో సోమవారం స మగ్ర కుటుంబ సర్వేలో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సంద ర్భంగా జీవన్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం నిరుపేద ల సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తుందన్నారు. గడిచిన సంవత్సర కాలంలో ఉచిత బస్సు ప్రయాణంతో పాటు 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ. 500లకు సబ్సిడీ గ్యాస్ సిలిండర్, రైతులకు రూ.2 లక్షల రుణ మాఫీ చేసిందన్నారు. కొంత మందికి రుణ మాఫీ సాంకేతిక సమస్య వలన, రే షన్‌కార్డు, ఇతర కారణాల వల్ల జరుగ లేనిది వాస్తవమని, కానీ అది కారులు వారి కుటుంబ వివరాలు సేకరించారని, నిధుల కొరతతో జాప్యం అవడం వాస్తవమని, త్వరలోనే రూ.2 లక్షల పైన ఉన్న వారి వి కూడా అందరికీ రుణ మాఫీ అవుతుందన్నారు.

గత ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టిందని అం దరికీ తెలిసిందేనని, అయినా రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు రూ. 18 వేల కోట్ల రుణ మాఫీ చేసిందని, ఇంకా రూ.10 వేల కోట్లు వెచ్చించి రూ.2 లక్షల రుణ మాఫీ చేస్తామని పేర్కొన్నారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

ఎమ్మెల్సీ వివరాలు నమోదు...

జగిత్యాల అర్బన్: సమగ్ర కుటుంబ సర్వేలో భాగంగా జగిత్యాల ప ట్టణంలో సర్వే చేస్తున్న సర్వే సిబ్బంది జగిత్యాల పట్టణంలోని ఎమ్మె ల్సీ జీవన్‌రెడ్డి ఇంటికి సర్వే నిమిత్తం వెళ్లారు. ఈ సందర్భంగా వారిని ఇంట్లోకి ఆహ్వానించిన ఎమ్మెల్సీ వారికి తమ కుటుంబ వివరాలను తెలి యజేశారు. సర్వేకు సంబంధించిన పూర్తి వివరాలు వెల్లడించి ఎన్యూమరేటర్లకు సహకరించారు.

కాటన్ వస్త్ర పరిశ్రమకు జీవం పోయాలి



మాట్లాడుతున్న కాటన్ పరిశ్రమల జేఏసీ నాయకులు

సిరిసిల్ల రూరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల కాటన్ వస్త్ర పరిశ్రమకు జీవం పోయాలని కాటన్ వస్త్ర పరిశ్రల జేఏసీ నాయకలు ఆడెపు రవీందర్, గౌడ వాసు కోరారు. సిరిసిల్ల ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సిరిసిల్లలో తయారు చేసే కాటన్ వస్త్రాలకు దేశవ్యాపంగా గుర్తింపు ఉందని, పాలిస్టర్ వస్త్రాల తయారీని తీసుకొచ్చి కాటన్ వస్త్రాల తయారీని కనుమరుగు చేశారని అన్నారు. దీనిపై సీఎం స్పందించి సిరిసిల్లలో కాటన్ వస్త్రాల తయారీకి జీవం పోయాలని, స్కూల్ యూనిఫాంల తయారీ ఆర్డర్‌లను అందించాలని అన్నారు. స్కూల్ యూనిఫాంను పాలిస్టర్ మిక్స్‌తో తయారు చేయాలని చేనేత జౌళి శాఖ కమిషనర్ ప్రకటించారని, పాలిస్టర్‌తో లేకుండా కాటన్‌తోనే స్కూల్ యూనిఫాం తయారు చేయించి కాటన్ పరిశ్రమలకు జీవం పోయాలన్నారు. గాజుల రవి, కళ్యాడపు మనోహర్, శివరాత్రి నటరాజ్, సాప రఘుపతి, వేముల భూమేశ్వర్, గాలి సత్యనారాయణ, రమేష్, సంతోష్, ఎక్కల్‌దేవి శ్రీనివాస్, శంకర్, సదానందం పాల్గొన్నారు.

వరి కొయ్యలు కాలిస్తే పర్యావరణానికి ముప్పు

చందుర్తి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : వరి కొయ్యలను కాలిస్తే పర్యావరణానికి తీవ్ర ముప్పు వాటిల్లుతుందని మండల వ్యవసాయ అధికారి దుర్గరాజు అన్నారు. చందుర్తి మండలం ఆనంతపల్లి గ్రామంలో సోమవారం రైతులకు వరి కొయ్యలను కాలిస్తే కలిగే ముప్పు గురించి తీసుకోవాలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయంలో ప్రస్తుత కూలీలు కొరత ఉండడంతో రైతులు యంత్రాలను ఆశ్రయిస్తున్నారని, వరి కోతలకు హార్వెస్టర్లను వినియోగిస్తుండడంతో గడ్డి వినియోగం తగ్గిపోతుందని అన్నారు. పశుసంపద ఉన్నవారు గడ్డిని సేకరిస్తుండగా మిగతావారు అలాగే పొలంలో వదిలేస్తున్నారన్నారు. తదుపరి పంటకు పొలాన్ని సిద్ధం చేసే క్రమంలో వరి కొయ్యలతోపాటు గడ్డిని దహనం చేస్తున్నారన్నారు. రైతుల అవగాహన లోపంతో చేస్తున్న ఈ చర్యతో భూమిలోని అవశేషాలు, ఖనిజలవణాలు నశిస్తాయని, భూసారానికి ముప్పు పొంచి ఉందని అన్నారు. వరి కొయ్యలను కాల్చడంతో వాతావరణ కాలుష్యం పెరుగుతుందన్నారు. విపరీతమైన వేడితో భూమి సారాన్ని కోల్పోతుందన్నారు. ముఖ్యంగా నత్రజని, ఫాస్ఫరస్ వంటి పోషక పదార్థాల శాతం, దిగుబడి తగ్గిపోతుందన్నారు. భూమికి పీచు పదార్థంగా ఉపయోగపడే అవశేషాలు కాలిపోతాయని, పంటలకు అవసరమైన ఖనిజ లవణాలు దెబ్బతింటాయని, మేలు చేసే సూక్ష్మజీవులు చనిపోయి పొలాల్లో తిరిగే పాములు ముంగిసలు, ఉడుములు, తొండలు ఇలా అనేక రకాల జీవరాసులు చనిపోయే ప్రమాదం ఉందని అన్నారు. దీంతో ప్రకృతి సమతుల్యత దెబ్బతిని పంట దిగుబడులు తగ్గిపోతాయన్నారు. వరి కొయ్యలు నేలలో కలియ దున్నటంతో సేంద్రీయ కర్బన శాతం పెరిగి దిగుబడులు 5 నుంచి 10 శాతం వరకు పెరిగే అవకాశం ఉందన్నారు. దుక్కి దున్నే సమయంలో సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ చల్లితే అవశేషాలు రెండు వారాల్లో ముగ్గి పోషకాలుగా అందుబాటులోకి వస్తాయని, ఫలితంగా డీఏపీ వాడకం సగం వరకు తగ్గుతుందని అన్నారు. కలియ దున్నితే ఎకరాకు దాదాపుగా టన్ను ఎరువు తయారవుతుందన్నారు. మొక్కలకు 2 శాతం నత్రజని, 4 శాతం ఫాస్ఫరస్ అదనంగా అందుతుందన్నారు. వీటితోపాటు జింకు, మాంగనీస్, ఇనుము, కాల్షియం వంటి సూక్ష్మధాతువులు అంది పంటకు మేలు చేకూరుస్తాయని, నేలలో కరగని మూలకాలను అనుకూలంగా మార్చుతాయని అన్నారు. నీటి నిల్వ సామర్థ్యం పెరుగుతుందన్నారు. కొయ్యకాళ్లను భూమిలో కలియదున్నితే గడ్డి ద్వారా పోషకాలు తిరిగి నేలకు చేరుతాయని, పొలం దున్నే 10 రోజులు ముందు గడ్డిని పొలంలో పరిచి నీరు అందించాలన్నారు. ఎకరాకు 50 కిలోల సూపర్ ఫాస్ఫేట్ చల్లాలన్నారు. దీంతో భూమి దెబ్బతినడం నుంచి తప్పించడం కాకుండా భూమిలో సేంద్రీయ పదార్థాల స్థాయిని పెంచవచ్చని తెలిపారు.



అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ శాఖ అధికారి దుర్గరాజు

వీర్నపల్లి : పంట పొలాల్లో వరి కొయ్యలను కాల్చవద్దని ఏఈవో ఫజల్ అన్నారు. వీర్నపల్లి మండల కేంద్రంలోని రైతు వేదికలో వరికొయ్యలను కాల్చడంపై జరిగే నష్టాలను రైతులకు సోమవారం వివరించారు. వరికొయ్యలను కాల్చడంతో సూక్ష్మజీవుల సంఖ్య తగ్గిపోతుందన్నారు.